ఎన్నికల ప్రత్యేక అనుబంధ సంచిక

RNI Regd. APTEL No. 2009/29147 Postal Regd. No. J/NLR/078/20-22

# ఆంధ్రలక్ష్మి

జాతీయ తెలుగు వార పత్రిక



సంపుటి : 15 | సంచిక : 32 | ఎడిటర్ : ఎస్.కె. గౌస్‌బాషా | తేది : 22-04-2024 | పేజీలు : 8 | వెల : 6/-

## ఖద్దరుపై మనసు పడుతున్న కలెక్టర్లు..!

మొన్నటి వరకు ఆ ఐఏఎస్ ఆంధ్రప్రదేశ్ సెక్రటేరియట్‌లో ఫైళ్లతో కుస్తీ పడుతుండేవారు. ఇప్పుడు కర్నూలు నగర వీధుల్లో తిరుగుతూ తనకు ఓటు వేసి గెలిపించాలంటూ ప్రజలను అభ్యర్థిస్తున్నారు. మరో అధికారి కూడా అంతే, ఏడెనిమిది నెలల కిందటి వరకు ప్రణాళిక శాఖలో కీలక బాధ్యతలు చూసిన ఆయన తన పదవికి రాజీనామా చేసి ప్రజల్లో తిరగడం ప్రారంభించారు. రాష్ట్రంలో పాదయాత్ర చేసి సొంతంగా పార్టీ ఏర్పాటు చేశారు. ఇప్పుడు తిరుపతి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఇలా ఒకరు కాదు ఇద్దరు కాదు పెద్ద సంఖ్యలో సివిల్ సర్వీసెస్ మాజీ అధికారులు ఆంధ్రప్రదేశ్ ఎన్నికల బరిలో దిగుతున్నారు. వీరిలో కొందరికి ఇప్పటికే ఎన్నికలలో పోటీ చేసిన అనుభవం, గెలిచి పదవులు చేపట్టిన అనుభవం ఉండగా మరికొందరికి మాత్రం ఇవే తొలి ఎన్నికలు. ఈ ఎన్నికలలో అందరి నోళ్లలో నానుతున్న ఇద్దరు ఐఏఎస్ అధికారులు ఏఎండీ ఇంతియాజ్, జీఎస్ఆర్‌కేఆర్ విజయ్ కుమార్. ఇద్దరూ సీనియర్ ఐఏఎస్ అధికారులే. ఇద్దరూ ఎన్నికలలో పోటీకి సిద్ధమయ్యారు. ఇంతియాజ్ ఇటీవలే



వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని పాలక వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో చేరగా, కర్నూలు అసెంబ్లీ స్థానానికి ఆయన్ను అభ్యర్థిగా ప్రకటించారు. మరో ఐఏఎస్ అధికారి విజయ్ కుమార్ రిటైర్మెంట్ తరువాత కూడా కీలక పదవిలో కొనసాగినప్పటికీ గత ఏడాది జులైలో ఆ పదవికి రాజీనామా చేసి ఎన్నికల రాజకీయాలలోకి అడుగు పెట్టారు. వీరిద్దరే కాదు ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ ఎన్నికలలో అసెంబ్లీ, లోక్ సభ స్థానాలకు పలువురు మాజీ ఉన్నతాధికారులు పోటీపడుతున్నారు. పాలనలో అత్యంత కీలకమైన కార్య నిర్వాహక, శాసన వ్యవస్థలు రెండూ ప్రజాసేవకు ఉద్దేశించినవే. కానీ, ఈ మాజీ ఉన్నతాధికారులు ఇప్పుడు శాసన వ్యవస్థపై గురి పెడుతున్నారు. ఇంతియాజ్ ఏపీ ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ అదనపు కమిషనర్ (సీసీ ఎల్ఏ)గా పనిచేస్తూ స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని రాజకీయాలలోకి వచ్చారు. అంతకు ముందు ఆయన మైనారిటీ వెల్ఫేర్ శాఖ స్పెషల్ సెక్రటరీగా, సెర్ప్ సీఈఓగా, కృష్ణా జిల్లా కలెక్టరు గా, ఇంకా ఏపీ ప్రభుత్వంలో అనేక ఇతర హోదాలలోనూ పనిచేశారు. నిజానికి ఇంతి యాజ్ సివిల్ సర్వీసెస్ నుంచి నేరుగా ఐఏఎస్ అయిన అధికారి కాదు. గ్రూప్ -1 పరీక్షలు పాసై కమర్షియల్ టాక్స్ అధికారిగా పనిచేస్తూ 2009లో ఐఏఎస్ హోదా పొందారు. తాజాగా ఆయన ప్రత్యక్ష రాజకీయాలలోకి రావడానికి ముందు తమ కుటుంబం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓ ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వ హిస్తుండేవారు. కర్నూలు జిల్లాలో రెండు రూపా యల డాక్టరుగా పాపులర్ అయిన కేఎం ఇస్మాయిల్‌కు ఇంతియాజ్ అల్లుడు.

(తరువాయి 2వ పేజీలో)

## ఏపీ ఎన్నికల్లో గెలిచేదెవరు..? అంచనాల విశ్లేషణకు ఎన్నో ప్రశ్నలు..!

ఏపీ అసెంబ్లీ ఎన్నికలకు సమయం దగ్గర పడుతుండటంతో 'గెలిచేదెవరు?' అనే విశ్లేషణల జోరు అమలాపురం నుంచి అమెరికా వరకు ఊపందుకుంది. ఎవరికి నచ్చిన కూర వాళ్లు వండుకున్నట్టు, తమకు నచ్చిన పార్టీ, నచ్చిన కులానికి అనుగుణంగా వారు విశ్లేషణలు చేసుకుంటున్నారు. ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఎవరికి అనుగుణంగా వారు విశ్లేషణలు చేసుకుంటున్నారు. కానీ, ఏ విశ్లేషణ అయినా, నిష్పక్షపాతంగా, నిర్దాక్షిణ్యంగా చేస్తేనే నిజం బయటపడుతుంది. దీన్నొక రచ్చబండ చర్చలా, టీ స్టాల్ దగ్గర ముచ్చటలాగా కాకుండా, ప్రైమరీ, సెకండరీ డేటా సేకరించి, దానిని శాస్త్రీయ పద్ధతిలో విశ్లేషించాలి. ఏ గణాంకాలను, ఏ ప్రాతిపదికన విశ్లేషిస్తే వాస్తవిక పరిస్థితికి అది అద్దం పడుతుంది? అన్నది ఓ శాస్త్రం. వైఎస్సార్సీపీ మద్దతుదారులు, సానుభూతిపరులు... 'గ్రామీణ ప్రాంతాల్లో బాగున్నాం, పట్టణ ప్రాంతాల్లో మాకు కొంత వ్యతిరేకత ఉంద'ని చెప్పుకుంటున్నారు. ప్రయివేటు సంభాషణల్లోనయినా ఒప్పుకుంటున్నారు. తెలుగుదేశం మద్దతుదారులు, పట్టణ ప్రాంతాల్లో బాగున్నాం, పల్లెల్లో నాడీ పసిగట్టలేకపోతున్నామని అంటున్నారు. దీనికి వారిరువురు చూపే కారణం... తాము అందించే పథకాలకు గ్రామీణ ప్రాంతాల్లో అధిక లబ్దిదారులు ఉన్నారని.. వారే మా స్టార్ క్యాంపెయినర్లు అని జగన్ కూడా తన లబ్దిదారుల ఓట్ల మీదే ఆశలు పెట్టుకున్నారు. కానీ, ఇలాంటి విశ్లేషణలు చేసేటప్పుడు, 2019 ఎన్నికల్లో తెలుగుదేశానికో, బీజేపీకో, జనసేనకో, కమ్యూనిస్టులకో ఓటు వేసిన ఒక ఓటరు, జగన్ చేపట్టిన అభివృద్ధి సంక్షేమ పథకాలు నచ్చి ఈసారి వైఎస్సార్సీపీ వైపు మొగ్గ చూపుతున్నారా? లేదా? అన్నది ప్రశ్న. ఈ ప్రశ్నకు వాస్తవిక సమాధానమే... ఓటర్లు ఎటువైపు నిలబడ్డారో అన్నది తెలిసిపోతుంది. దేశంలో ఏ రాష్ట్రంలో చూసినా... పథకాల పేర్లే మారుతున్నాయి కానీ, ఇంచుమించు అన్ని ప్రభుత్వాలు జగన్ అమలు చేస్తున్న నవరత్నాల్లాంటి పథకాలనే అమలు చేస్తున్నాయి. పైగా, ప్రభుత్వం మారితే పథకాలు పోతాయానే భయం-ఆందోళన ప్రజల్లో మాయమై రెండు దశాబ్దాలు దాటింది. ఇప్పుడు ఏ ప్రభుత్వం వచ్చినా సంక్షేమ పథకాలు పెరుగుతాయే తప్ప, తగ్గుతాయనే భయం ఎవరికీ లేదు. 2019లో చంద్రబాబు అమలు చేసిన పథకాలు పోతాయనే భయం లేకపోవడం వల్లే, నిర్భయంగా వైఎస్సార్సీపీకి ఓటు వేశారు. అలాగే, తెలంగాణలో కేసీఆర్ అమలు చేసిన సంక్షేమ పథకాలు పోతాయేమోననే భయాలేవిటినీ ప్రజలు ఓటేసేటప్పుడు పరిగణనలోకి తీసుకోలేదు. కాబట్టి, పథకాల కోణంలో చూసినప్పుడు, కేవలం నవరత్నాల్ని చూసే గ్రామీణ ప్రాంతాల ప్రజలు జగన్‌కి మళ్లీ పట్టం కడతారా? అని విశ్లేషకులు ఆలోచించుకోవాలి. ప్రజల మూడ్ ఒక ప్రాంతంలో ఒకలాగా, ఇంకో ప్రాంతంలో మరోలాగా ఉండదు. అది ఒక అల లాగ ఒకేలా ఉంటుంది. ఏదో కొంత వ్యత్యాసం తప్ప, దాదాపు అంతటా ఒకేలా ప్రతిబింబిస్తుంది. బాహుబలి సినిమా గ్రామాల్లో ఒకలా, పట్టణాల్లో ఒకలా ఆడిందా? హిట్టు లేదా ఫ్లాఫ్ అయిన ఒక సినిమా, రూరల్‌లో హిట్ అయ్యి అర్బన్‌లో ఫెయిల్ అవడం, కాకపోతే అర్బన్‌లో హిట్టయి రూరల్‌లో ఫెయిలవడం ఉంటుందా? ఒకప్పుడు హైదరాబాద్‌లో దొరికే బిర్యానీ, చైనీస్ ఫుడ్ ఇప్పుడు గ్రామాలకు కూడా చేరింది. నగరం, పట్టణం, గ్రామం.. ప్రాంతం వేరైనా, ప్రజల మూడ్, టేస్ట్ దాదాపు ఒకే విధంగా ఉంటుందని చెప్పడానికి ఇవే తార్కాణాలు. కెనడా తత్వవేత్త, ప్రొఫెసర్ మార్షల్ మెక్లూహన్ సిద్ధాంతం ప్రకారం టీవీ, ఇంటర్నెట్, కనెక్టివిటీ పెరిగిన తర్వాత ప్రపంచం ఒక చిన్న కుగ్రామంగా మారిపోయింది. నగరాలకు, గ్రామాలకు మధ్య వ్యత్యాసం తగ్గిపోయింది. బతుకుదెరువు కోసం పట్టణాలకు వచ్చిన ఎంతోమంది తమ తమ ఊరుకెళ్లే ఓటేస్తుంటారు. మరి వీళ్లను అర్బన్ ఓటర్ అనాలా? లేక రూరల్ ఓటర్ అనాలా? ఇటు అటు తిరిగే క్రమంలో పట్టణాల్లో ఉండే వాళ్ల అభిప్రాయలు, గ్రామాలను ప్రభావితం చేయవా? గ్రామాలకు, పట్టణాలకు మధ్య ఉన్న గోడలు తొలగిపోయాయి. ఇప్పుడు ఇడుపులపాయలో పప్పు ధర ఎంత ఉంటుందో, ఇచ్ఛాపురంలో కూడా అంతే ఉంటుంది. పులివెందులలో ఒక యూనిట్‌కి ఎంత కరెంటు బిల్లు వస్తుందో, కుప్పంలో కూడా అంతే వస్తుంది. దీనిపై ప్రజా స్పందన కూడా దాదాపు ఒకేలా ఉంటుంది. ఐదు వేళ్లలో ఏ వేలికి దెబ్బ తాకినా బాధ ఒకేలా ఉంటుందన్న రావిశాస్త్రీగారి మాట, ప్రజల మూడ్ కి అద్దం పడుతుంది. విశ్లేషణ చేసేవారు ఎవరయినా సరే, ముఖ్యంగా వైఎస్సార్సీపీ సానుభూతిపరులు 2019 ఎన్నికల్లో గ్రామీణ ప్రాంతాల్లో వచ్చిన మద్దతు ఇప్పటికీ కొనసాగుతోందా? అప్పటితో పోలిస్తే అదేమైనా తగ్గిపోయిందా? పట్టణ ప్రాంతాల్లో వైఎస్సార్సీపీకి 2019లో వచ్చిన మద్దతు ఈసారి ఇంకా పెరిగిందా? తగ్గిందా? అని తెలుసుకోవాలి. టీడీపీ-జనసేన-బీజేపీ కూటమికి 2019

(తరువాయి 2వ పేజీలో)

www.andhralaxmitelugu.in వెబ్‌సైట్‌లో వార్తలు చూడండి!

తేది : 22- 04-2024 ఆంధ్రలక్ష్మి 2 సంపుటి : 15 సంచిక : 32

# ఖద్దరుపై మనసు పడుతున్న కలెక్టర్లు..!

(1వ పేజీ తరువాయి)

కర్నూలు సిటింగ్ ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్‌కు ఈసారి టికెట్ ఇవ్వ కుండా కొత్తగా పార్టీలో చేరిన ఇంతియాజ్‌కు జగన్మోహన్ రెడ్డి టికెట్ కేటాయించారు. ఐఏఎస్ అధికారి జీఎస్ఆర్‌కేఆర్ విజయ్ కుమార్ 2023 జులై 22న ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ సీఈఓ పదవికి రాజీనామా చేశారు. అంతకుముందే రిటైరైన ఆయన్ను జగన్ ప్రభుత్వం ఏపీ స్టేట్ డెవలప్‌మెంట్ ప్లానింగ్ సొసైటీ సీఈవోగా నియమించింది. దళిత వర్గానికి చెందిన విజయ్ కుమార్‌కు ప్రకాశం సహా వివిధ జిల్లాలలో కలెక్టర్‌గా, అనంతపురం జిల్లాలో సబ్ కలెక్టరుగా పనిచేసిన అనుభవం ఉంది. అనంతపురం జిల్లాలో ఆయన సబ్ కలెక్టర్‌గా ఉన్నప్పుడు ఓ ఎన్నికలలో పరిటాల రవి ఎన్నికల అక్రమాలకు పాల్పడితే సమర్థంగా అడ్డుకున్నానని, 73 పోలింగ్ బూత్‌లలో రీపోలింగ్ జరిగేలా చేసి ఎన్నికలు స్వేచ్ఛగా, సజావుగా సాగేలా చేశానని విజయ్ కుమార్ గతంలో కొన్ని ఇంటర్వ్యూలలో చెప్పారు. దీంతో పరిటాల రవిని ఎదిరించిన అధికారిగా ఆయనకు గుర్తింపు వచ్చింది. విజయ్ కుమార్ గత ఏడాది తన పదవికి రాజీనామా చేసిన తరువాత తిరుపతి జిల్లా తడ నుంచి కాకినాడ జిల్లా తుని వరకు 142 రోజుల పాటు పాదయాత్ర చేశారు. 12 జిల్లాల్లోని 65 నియోజకవర్గాలలో సుమారు 2,700 కిలోమీటర్ల మేర ఆయన పాదయాత్ర సాగింది. యాత్ర సమయంలో ప్రజల సమస్యలు తెలుసుకున్నానని, ప్రజలకు సేవ చేయడానికి సిద్ధమయ్యానంటూ ఆయన లిబరేషన్ కాంగ్రెస్ పేరుతో రాజకీయ పార్టీని స్థాపించారు. ఆ పార్టీ తరపున తిరుపతి (ఎస్సీ) లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. నామినేషన్ల స్వీకరణ తొలి రోజున ఏప్రిల్ 18న ఈయన నామినేషన్ కూడా వేశారు. జగన్ ప్రభుత్వంలో కీలక శాఖలలో పనిచేసిన విజయ్ కుమార్‌ను వలంటీర్ వ్యవస్థ రూపకల్పనలోనూ కీలక వ్యక్తిగా చెప్తారు. ఉద్యోగానికి రాజీనామా తరువాత ఆయన వైసీపీ నుంచి ఎన్నికలలో పోటీ చేస్తారని ప్రచారం జరిగినప్పటికీ సొంతంగా పార్టీ స్థాపించి పోటీ చేస్తున్నారు. తిరుపతి లోక్‌సభ స్థానానికి వైఎస్ ఆర్ కాంగ్రెస్ పార్టీ నుంచి సిటింగ్ ఎంపీ గురు మూర్తి పోటీ చేస్తుండగా ఎన్డీయే కూటమి నుంచి బీజేపీ అభ్యర్థిగా వెలగపల్లి వరప్రసాద్ పోటీ చేస్తున్నారు. జేడీ లక్ష్మీనారాయణగా పాపులర్ అయిన సీబీఐ మాజీ జేడీ వీవీ లక్ష్మీనారాయణ కూడా ప్రస్తుత ఎన్నికల బరిలో ఉన్నారు. 2019 ఎన్నికలలో జనసేన నుంచి విశాఖపట్నం లోక్ సభ స్థానానికి పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం జనసేనకు రాజీనామా చేసి 2023 చివర్లో 'జై భారత్ నేషనల్ పార్టీ' పేరిట కొత్త రాజకీయ పార్టీని స్థాపించారు. 'జీరో బడ్జెట్ పాలిటిక్స్' అనే నినాదంతో ఆయన ఈ ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. జేడీ లక్ష్మీనారాయణ ఈసారి విశాఖ నార్త్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ప్రతి నియోజకవర్గాన్ని ఒక అభివృద్ధి కేంద్రంగా మారుస్తామంటూ ఇప్పటికే ఒక మేనిఫెస్టోను కూడా ఆయన ప్రకటించారు. 1990 బ్యాచ్ మహారాష్ట్ర క్యాడర్ ఐపీఎస్ అధికారి అయిన లక్ష్మీనారాయణ సీబీఐలో పనిచేస్తున్న సమయంలో అనేక కీలక కేసుల విచారణలో పాలుపంచుకున్నారు. జగన్ అక్రమాస్తుల కేసు, ఓబుళాపురం మైనింగ్ కేసు, సత్యం కంప్యూటర్స్ కుంభకోణం, ఎమ్మార్ ప్రాపర్టీస్ వంటి కీలక కేసుల విచారణతో ఆయన గుర్తింపు తెచ్చుకున్నారు. కాగా లక్ష్మీనారాయణ ప్రస్తుతం పోటీ చేస్తున్న విశాఖ నార్త్ నియోజకవర్గంలో వైసీపీ నుంచి కె.కన్నపరాజు పోటీ చేస్తుండగా ఎన్డీయే కూటమి అభ్యర్థిగా బీజేపీ మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు పోటీ చేస్తున్నారు. కన్నపరాజు 2019 ఎన్నికలలో అప్పటి టీడీపీ అభ్యర్థి గంటా శ్రీనివాసరావు చేతిలో 1419 ఓట్ల తేడాతో ఓడిపోయారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీ విభాగాల నేషనల్ కోఆర్డినేటర్ కొప్పుల రాజు కాంగ్రెస్ పార్టీ నుంచి నెల్లూరు లోక్‌సభ నియోజకవర్గంలో పోటీ చేస్తున్నారు. 1981 బ్యాచ్ ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి అయిన కొప్పుల రాజు 2013లో నేషనల్ అడ్వయిజరీ కౌన్సిల్ చైర్మన్‌గా ఉంటూ తన స్వచ్ఛంద ఉద్యోగ విరమణ తీసుకున్నారు. అప్పటి నుంచి రాహుల్ గాంధీ టీంలో కీలకంగా వ్యవహరిస్తున్నారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీలో శాశ్వత ఆహ్వానితుడిగానూ ఉన్న కొప్పుల రాజు ప్రత్యక్ష ఎన్నికలలో పోటీ చేయడం ఇదే తొలిసారి. నామినేషన్ల స్వీకరణ తొలి రోజైన ఏప్రిల్ 18న ఆయన తన నామినేషన్ దాఖలు చేశారు. కాగా నెల్లూరు లోక్‌సభ సీటుకు వైఎస్ ఆర్ కాంగ్రెస్ నుంచి ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి, తెలుగుదేశం నుంచి వైసీపీ మాజీ ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి పోటీ చేస్తున్నారు. ఇప్పటికే హైప్రొఫైల్ నియోజకవర్గంగా మారిన నెల్లూరులో కొప్పుల రాజు ఎంతవరకు ప్రభావం చూపుతారనేది చూడాలి. ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానం తిరుపతిలో బీజేపీ నుంచి పోటీ చేస్తున్న వెలగపల్లి వరప్రసాద రావు కూడా మాజీ ఐఏఎస్ అధికారే. వరప్రసాదరావు 1983 బ్యాచ్ తమిళనాడు క్యాడర్ ఐఏఎస్ అధికారి. ఆ రాష్ట్రంలో ఆయన కీలక పదవులు నిర్వహించారు. 2009లో స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకుని ప్రజారాజ్యం పార్టీలో చేరి తిరుపతి నుంచి పోటీ చేశారు. కానీ ఆ ఎన్నికలలో ఆయన ఓటమి పాలయ్యారు. అనంతరం 2014లో వైఎస్ఆర్ కాంగ్రెస్ నుంచి తిరుపతి ఎంపీగా గెలిచిన ఆయన 2019లో గూడూరు(ఎస్సీ) అసెంబ్లీ స్థానంలో వైసీపీ నుంచి గెలుపొందారు. అయితే, ఈ ఎన్నికలలో ఆయనకు టికెట్ రాకపోవడంతో కొద్ది రోజుల కిందటే బీజేపీలో చేరి తిరుపతి టికెట్ సాధించుకున్నారు. కృష్ణా జిల్లాకు చెందిన వరప్రసాదరావు రాజకీయంగా సొంత జిల్లాలో కాకుండా దక్షిణ ఆంధ్రలో కెరీర్ వెతుక్కున్నారు. బాపట్ల (ఎస్సీ) లోక్ సభ స్థానంలో బీజేపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న టి.కృష్ణప్రసాద్ 1983 బ్యాచ్ ఐపీఎస్ అధికారి. తెలంగాణలో డీజీ హోదాలో ఆయన రిటైరయ్యారు. అనంతరం బీజేపీ నుంచి వరంగల్ టికెట్ కోసం ప్రయత్నాలు చేశారు. ఇప్పుడు బీజేపీ, టీడీపీ, జనసేన కూటమి అభ్యర్థిగా ఏపీలోని బాపట్ల నుంచి అవకాశం దక్కించుకున్నారు. కృష్ణ ప్రసాద్ గతంలో విజయవాడ పోలీస్ కమిషనర్‌గా, వరంగల్, విశాఖ రేంజ్‌ల లో డీఐజీగా పనిచేశారు. నెల్లూరు, విశాఖపట్నం, మెదక్, గుంటూరు జిల్లాలలో ఎస్పీగానూ పనిచేశారు. ఉమ్మడి గుంటూరు జిల్లాకు ఎస్పీగా పనిచేసిన అనుభవం ఉండడం ఇప్పుడు టికెట్ తెచ్చుకోవడంలో కలిసొచ్చింది. శింగనమల నియోజకవర్గంలో గతంలో గెలిచిన తల్లీకూతుళ్లు శమంతకమణి, యామినీబాలలు కృష్ణప్రసాద్‌కు సమీప బంధువులు. బాపట్లలో వైసీపీ నుంచి సిటింగ్ ఎంపీ నందిగం సురేశ్ పోటీ చేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీ నుంచి కేంద్ర మాజీ మంత్రి జేడీ శీలం ఇక్కడ పోటీ చేస్తున్నారు. జేడీ శీలం కూడా ఒకప్పుడు ఐఏఎస్ అధికారే. ఆయన కర్ణాటక క్యాడర్‌లో ఐఏఎస్ అధికారిగా పనిచేస్తూ రాజకీయాలలోకి వచ్చారు. ఎస్ఎం కృష్ణ కర్ణాటక ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో ఆయనకు రాజకీయ కార్యదర్శిగా పనిచేసిన జేడీ శీలం తన ఉద్యోగానికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ పార్టీ ఆయన్ను 2004లో రాజ్యసభకు పంపించింది. అప్పటి యూపీయే ప్రభుత్వంలో ఆయన ఆర్థిక శాఖ సహాయ మంత్రిగా పనిచేశారు. 2019 ఎన్నికలలో జనసేన పార్టీ గెలిచిన ఏకైక స్థానం రాజోలు. ఎస్సీ రిజర్వ్‌డ్ స్థానమైన రాజోలు నుంచి గెలిచిన రాపాక వరప్రసాద్ అనంతరం వైసీపీలో చేరిపోయారు. ప్రస్తుత ఎన్నికలలో జనసేన పార్టీ ఈ సీట్లో దేవ వరప్రసాద్‌కు టికెట్ కేటాయించింది. వరప్రసాద్‌ది రాజోలు నియోజకవర్గంలోని దిండి గ్రామం. ఆంధ్రప్రదేశ్ క్యాడర్‌కు చెందిన ఐఏఎస్ అధికారి అయిన ఆయన సివిల్ సప్లయ్స్ సెక్రటరీగా, కమిషనర్‌గా, లేబర్ కమిషనర్‌గా పనిచేశారు. కొందరు మాజీ ఐఆర్ఎస్ అధికారులూ ఏపీ ఎన్నికలలో తమ అదృష్టాన్ని పరీక్షించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఎస్సీ రిజర్వ్‌డ్ లోక్‌సభ స్థానం చిత్తూరులో తెలుగుదేశం పార్టీ ఐఆర్ఎస్ మాజీ అధికారి దగ్గుమళ్ల ప్రసాద రావును పోటీ చేయిస్తోంది. మరో విశ్రాంత ఐఆర్ఎస్ అధికారి మెట్ట రామారావు విశాఖ లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేస్తున్నారు. ఆయన తాను స్థాపించిన ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ నుంచి పోటీలో ఉన్నారు. 2019లో శ్రీకాకుళం లోక్‌సభ నియోజకవర్గంలో జనసేన తరఫున పోటీ చేసిన రామారావు అనంతరం ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ పేరిట రాజకీయ పార్టీ ఏర్పాటు చేశారు. ఆల్ తెలుగు ప్రజా పార్టీ పేరిట కొత్త పార్టీ పెట్టిన మరో ఐఆర్ఎస్ అధికారి కటికల శివభాగ్యరావు కూడా ఈ ఎన్నికలలో బాపట్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి నామినేషన్ వేశారు. వీరే కాకుండా తమిళనాడుకు చెందిన ఆంధ్రప్రదేశ్ క్యాడర్ ఐఏఎస్ అధికారి పేరు కూడా ఒక దశలో వినిపించింది. వైసీపీ నుంచి ఏపీలో పోటీ చేస్తారన్న ప్రచారం జరిగింది.

# ఏపీ ఎన్నికల్లో గెలిచేదెవరు..?

(1వ పేజీ తరువాయి)

ఎన్నికలతో పోలిస్తే గ్రామీణ ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో మద్దతు పెరిగిందా? తగ్గిందా? అన్న విషయాన్ని విశ్లేషణలకు పరిగణనలోకి తీసుకోవాలి. కలిసి కూటమిగా పోటీ చేస్తున్నందున, ఒకరి మద్దతుదారులు భాగస్వాములు మరొకరికి అనుకూలంగా ఓటేస్తారా? ఆ మేర, సజావుగా ఓటు బదిలీ అవుతుందా? అన్న కోణంలో ఆలోచించాలి. సీఎస్డీఎస్-లోక్‌నీతి డేటా ప్రకారం 2019లో గ్రామీణ ప్రాంతంలో వైఎస్సార్సీపీకి 56, టీడీపీ 37, కాంగ్రెస్ కి 1.7, బీజేపీకి 0.3, ఇతరులకు 5 శాతం మద్దతు లభించింది. పట్టణ ప్రాంతాల విషయానికి వస్తే వైఎస్సార్సీపీ 35, టీడీపీ 44, కాంగ్రెస్ 1, బీజేపీకి 3 శాతం, ఇతరులకు 17 శాతం మద్దతు లభించింది. జనసేనకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఎంత శాతం ఓట్లు లభించాయో వారు వెల్లడించలేదు. అయితే, 2019 ఎన్నికల్లో జనసేన పార్టీకి మొత్తమ్మీద దాదాపు 6 శాతం ఓట్లు వచ్చాయి. ఈ డేటా ప్రకారం 2019 ఎన్నికల్లో వైఎస్సార్సీపీ గ్రామీణ ప్రాంతంలో తెలుగుదేశం పార్టీపై 19 శాతం ఆధిక్యంలో ఉంది. పట్టణ ప్రాంతాల్లో తెలుగుదేశం పార్టీ 9 శాతం వైసీపీపై ఆధిక్యత సాధించింది. మొత్తంగా చూసినపుడు 2019 ఎన్నికల్లో వైఎస్సార్సీపీకి దాదాపు 50 శాతం, టీడీపీకి 40 శాతం ఓట్లు, జనసేనకు 6 శాతం, బీజేపీకి 0.9, కాంగ్రెస్ కి 1 శాతం ఓట్లు వచ్చాయి. స్థూలంగా చూసినపుడు, వైసీపీకి గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువ, పట్టణ ప్రాంతాల్లో తక్కువ ఆదరణ అన్నది, పై గణాంకాల ప్రకారం ఆనాటి పరిస్థితే! కొత్తదేమీ కాదు. అందుకు భిన్నమైన పరిస్థితి టీడీపీది. స్థూలాభిప్రాయాలు కాకుండా.... ఎక్కడ్కెనా కొత్తగా పెరిగారా? తగ్గారా? అలా జరిగితే అందుకు ఆధారాలేమిటి? అన్నదే ప్రశ్న! దాన్ని బట్టే విశ్లేషణ సాధ్యమౌతుంది. ప్రస్తుతం 2024 ఎన్నికల్లో టీడీపీ, బీజేపీ, జనసేన పొత్తు పెట్టుకుని పోటీ చేస్తున్నాయి. వాటికి 2019లో వచ్చిన ఓట్ల శాతం కలిపితే, దాదాపు 47 శాతానికి చేరుతుంది. కాంగ్రెస్, కమ్యూనిస్టులు కలిసి మరో కూటమిగా పోటీ చేస్తున్నారు. ఇప్పుడు వీరు, వైఎస్సార్సీపీ ఓట్లను చీల్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీనితో పాటు, సాధారణంగా ప్రభుత్వంపై ఉండే వ్యతిరేకత ఉన్నప్పుడు బలంగా ఉండే విపక్ష కూటమికి అనుకూలంగా తోడవుతుంది. అంటే, వైఎస్సార్సీపీ ఓట్లు 41-43 శాతం దగ్గర ఆగిపోయే అవకాశాలు ఉన్నాయి. అధికార పక్షం కంటే, 4 నుంచి 5 శాతం ఆధిక్యంలో ఎన్డీయే కూటమి ఉండే అవకాశం కనబడుతోంది. ప్రముఖ రాజకీయ విశ్లేషకుడు యోగేంద్ర యాదవ్ లెక్క ప్రకారం... గతంలో ఓట్లు వేసిన వర్గాల మద్దతు అలాగే ఉందా? లేక తేడా ఉందా? అనేదే విశ్లేషణకు ప్రాతిపదిక కావాలి. ఇది కేవలం ఒక గ్రామీణ ప్రాంతానికో, పట్టణ ప్రాంతానికో సంబంధించినది కాదు. వివిధ సమూహాలు, లింగం, వయసు అన్నీ పరిగణనలోకి తీసుకోవాలి. 2019లో మద్దతు ఇచ్చిన సమూహాలు, ప్రాంతాలు, సామాజిక వర్గాలు అదే పార్టీకి లేదా కూటమికి ఇప్పుడు ఇంకా ఎక్కువ మద్దతు ఇస్తున్నారా? లేదా అవి ప్రత్యర్థి పక్షం వైపు చూస్తున్నాయా? అన్న గణాంకాల ఆధారంగా విశ్లేషించాలి. ఉదాహరణకు ప్రభుత్వ ఉద్యోగులు వేసే పోస్టల్ బ్యాలెట్స్ 2019లో వైఎస్సార్సీపీకి 45.55 శాతం, టీడీపీ 23.32 శాతం, జనసేనకు 3.76, బీజేపీకి 1.40, కాంగ్రెస్ కి 0.42 శాతం పోలయ్యాయి. ఈసారి ప్రభుత్వ ఉద్యోగులు ఎలా ఉన్నారు? సీఎం జగన్ ఏడాది కింద 'క్లాస్ వార్' నినాదం అందుకున్నారు. ఈ ఎన్నికలను పేదవాళ్లకు, పెత్తందారులకు మధ్య జరిగే యుద్ధంగా అభివర్ణించారు. అయితే, ఇప్పుడు ఎవరినైతే తన లబ్ధిదారులు అనుకుంటున్నారో, 2019లో మద్దతిచ్చిన 50 శాతం మంది ఓటరల్లో ఈ లబ్ధిదారులు ఉన్నారా? లేరా? వారు కాకుండా అదనంగా వచ్చి చేరే ఓటర్లు ఎవరు? అప్పటి మద్దతుదారుల్లో ఇప్పుడు జారిపోయే వారెవరు? ఇలా, వేర్వేరు హేతుబద్ధమైన ప్రశ్నలు వేసుకుంటూ సమీకరణాలను విశ్లేషిస్తే, పరిస్థితిని సరిగ్గా అంచనా వేయడానికి వీలుంటుంది. పీపుల్స్ పల్స్ రీసర్చ్ ప్రకారం... ఈ ఎన్నికలు కూడా 2014 ఎన్నికల్లాగే హోరా హోరిగా జరిగే అవకాశం ఉంది. విడతలుగా క్షేత్ర స్థాయిలో నిర్వహించిన సర్వేల ప్రకారం... కచ్చితంగా కాంగ్రెస్ కు కొంత ఓటు శాతం పెరిగే అవకాశాలు ఉండటంతో అది ఎవరికి? ఏ మేర నష్టం చేస్తుంది? 2014తో పోలిస్తే, బీజేపీ మీద, మోడీ మీద ముస్లింల్లో వ్యతిరేకత అధికమైంది. అయితే, 2019లో మోదీని వ్యతిరేకిస్తూ చంద్రబాబు బీజేపీకి ఎదురు తిరిగినట్టుగా జగన్ ఎదురు తిరగడం లేదు. కాబట్టి, ముస్లింలు పూర్తి స్థాయిలో ఆయనకు మద్దతు ఇచ్చే అవకాశాలు ఉన్నాయా? అనేది ఆసక్తికరమైన అంశం. ఈ ప్రశ్నలన్నింటికీ సమాధానంగా ప్రజల నుంచి వ్యక్తమయ్యే అభిప్రాయాలే, రేపటి ఆంధ్రప్రదేశ్ ఎన్నికల భవితవ్యాన్ని తేల్చబోతున్నాయన్నది సుస్పష్టం.

తేది : 22- 04-2024 ఆంధ్రలక్ష్మి 3 సంపుటి : 15 సంచిక : 32

# ఎమ్మెల్యే కావాలంటే ఫస్ట్ స్టెప్.. ఈ జాగ్రత్తలు తప్పనిసరి..!

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలైంది. దేశంలో సార్వత్రిక ఎన్నికల నాలుగో దశలోనే ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీకి ఎన్నికలు జరుగుతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ, లోక్‌సభ స్థానాలు.. తెలంగాణ లోక్‌సభ సీట్లకు మే 13న పోలింగ్ జరగనుంది. అందుకు గాను గురువారం(ఏప్రిల్ 18, 2024) నుంచి నామినేషన్ల స్వీకరణ మొదలైంది. నామినేషన్ల దాఖలుకు తుది గడువు ఏప్రిల్ 25. అసెంబ్లీ, లోక్‌సభకు పోటీ చేయాలనుకునేవారు ఆలోగానే నామినేషన్లు దాఖలు చేయాల్సి ఉంటుంది. ఈసారి ఏపీలో పొత్తులు, ఇతర కారణాల వల్ల అన్ని పార్టీలలోనూ రెబల్స్ బెడద ఉండడంతో పాటు స్వతంత్రంగా పోటీ చేయడానికి సిద్ధమవుతున్నవారూ కనిపిస్తున్నారు. ఇంతకూ అసెంబ్లీ ఎన్నికలలో ఎవరైనా పోటీ చేయొచ్చా? ఎమ్మెల్యేగా పోటీ చేయాలంటే అర్హతలేంటి? ఎవరు చేయొచ్చు? ఎవరు చేయకూడదు? నామినేషన్లు వేసేటప్పుడు పాటించాల్సిన పద్ధతులేంటి? తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయాలనుకునేవారు ఎన్నికల రిటర్నింగ్ అధికారికి తమ నామినేషన్ సమర్పించాలి. నామినేషన్ వేసేటప్పుడు వారి అభ్యర్థిత్వాన్ని ఇతరులు ప్రతిపాదించాలి. అలా ప్రతిపాదించే వారిని ప్రపోజర్ అంటారు. గుర్తింపు పొందిన జాతీయ పార్టీ నుంచి కానీ రాష్ట్ర పార్టీ నుంచి కానీ పోటీ చేసే అభ్యర్థులకైతే కనీసం ఒక ప్రపోజర్ ఉండాలి. అదే స్వతంత్ర అభ్యర్థులకైతే కనీసం 10 మంది ప్రపోజర్లు ఉండాలి. ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 33(1) ప్రకారం ఇది తప్పనిసరి. భారత ఎన్నికల కమిషన్ (ఈసీఐ) దగ్గర రిజిస్టరైనా ఇంకా గుర్తింపులేని పార్టీలు(రిజిస్టర్డ్ అన్‌రికగ్నైజ్డ్) నుంచి పోటీ చేసే అభ్యర్థులకూ 10 మంది ప్రపోజర్లు ఉండాలి. తగినంత మంది ప్రపోజర్లు లేనప్పుడు వారి నామినేషన్లు తిరస్కరణకు గురవుతాయి. అలాగే,



ప్రపోజర్లకు అభ్యర్థి పోటీ చేస్తున్న నియోజకవర్గంలో ఓటు హక్కు లేకపోయినా వారి ప్రతిపాదన చెల్లదు. నామినేషన్ సమయంలో నోటరీ చేసిన అఫిడవిట్ సమర్పించాలి. అందులో అభ్యర్థి ఆస్తులు, అప్పులు, కేసులు వంటి అన్ని వివరాలూ ఉండాలి. భారతదేశ పౌరుడినని / పౌరురాలినని , రాజ్యాంగానికి, భారత సార్వభౌమాధికారానికి కట్టుబడి ఉంటాననే ప్రమాణ పత్రం నామినేషన్ల సమయంలో సమర్పించాలి. వీటితో పాటు నామినేషన్‌ల సమయంలో రిటర్నింగ్ అధికారి అడిగే ఏ ధ్రువపత్రాన్నైనా అభ్యర్థులు సమర్పించాల్సి ఉంటుంది. ఇందుకు నామినేషన్ల పరిశీలన తుది గడువు వరకు సమయం ఉంటుంది. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 36 ప్రకారం అభ్యర్థుల నామినేషన్లను పరిశీలించే, అర్హత నిర్ణయించే అధికారం రిటర్నింగ్ అధికారిదే. నామినేషన్ల పరిశీలన రోజు నాటికి 25 ఏళ్లు పూర్తయి ఉండాలి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 173(బీ) ప్రకారం అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులకు కచ్చితంగా 25 ఏళ్లు నిండాలి. ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రంలో ఏదైనా నియోజకవర్గంలో ఓటరుగా నమోదై ఉండాలి. ఓటు హక్కు ఉన్న నియోజకవర్గం నుంచి కాకుండా వేరే నియోజకవర్గం నుంచి పోటీ చేయాలనుకుంటే తనకు ఓటు హక్కు ఉన్నట్లు ధ్రువీకరణ పత్రాన్ని సమర్పించాలి. ఎస్సీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలు, ఎస్టీ రిజర్వ్‌డ్ నియోజకవర్గాలలో పోటీ చేసేవారు ఆయా వర్గాలకు చెందినవారై ఉండాలి. ఈ మేరకు కుల ధ్రువీకరణ పత్రం తప్పనిసరి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందినవారు జనరల్ కేటగిరీ నియోజకవర్గాల నుంచి కూడా పోటీ చేయొచ్చు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్- 4, 5 దీనికి అనుమతిస్తున్నాయి. నామినేషన్లు వేసే టప్పుడు చాలా మంది అభ్యర్థులు భారీ ఊరేగింపుగా వెళ్తుంటారు. అయితే, రిటర్నింగ్ అధికారి కార్యాలయానికి 100 మీటర్ల పరిధిలోపు మాత్రం ఇలాంటి ఊరేగింపులకు అనుమతి ఉండదు. ఆ 100 మీటర్ల దూరంలోకి గరిష్ఠంగా 3 వాహనాలనే అనుమతిస్తారు. రిటర్నింగ్ అధికారి కార్యాలయంలోకి కూడా పెద్దసంఖ్యలో జనం వెళ్లడానికి వీల్లేదు. అభ్యర్థి సహా మొత్తం అయిదుగురు మాత్రమే వెళ్లడానికి అనుమతి ఉంటుంది. నామినేషన్ పరిశీలించేటప్పుడు అభ్యర్థి, ఆయన ఎలక్షన్ ఏజెంట్, ఆయన ప్రపోజర్లలో ఒకరు, మరొక వ్యక్తి ఎవరైనా (న్యాయవాదిని తీసుకెళ్లొచ్చు) వెళ్లొచ్చు. ఇతరులు ఎవరూ వెళ్లడానికి వీల్లేదు. ఒక రాష్ట్రంలో ఓటు హక్కు ఉండి, మరో రాష్ట్రంలో పోటీ చేయడానికి వీల్లేదు. ప్రజాప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 5 ప్రకారం ఇలాంటి అవకాశం లేదు. అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేస్తున్న రాష్ట్రంలోనే ఓటు హక్కు ఉండాలి. ఏ కేసులోనైనా దోషిగా నిర్ధరణై రెండేళ్ల జైలు శిక్ష పడితే ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులు. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 8(3) ప్రకారం అలాంటివారు ఎన్నికలలో పోటీ చేయడానికి అనర్హులు. దోషిగా తేల్చుతూ ఇచ్చిన తీర్పుపై స్టే ఉంటే ఆ సమయంలో ఎన్నికలలో పోటీ చేయొచ్చని సుప్రీంకోర్టు ఓ కేసులో చెప్పింది. సర్వీస్‌లో ఉన్న ప్రభుత్వ ఉద్యోగులు ఎన్నికలలో పోటీ చేయడానికి అర్హులు కారు. ఎన్నికలలో పోటీ చేయాలంటే ప్రభుత్వ ఉద్యోగానికి రాజీనామా చేయాల్సి ఉంటుంది. చట్ట ప్రకారం తమకు అన్ని అర్హతలు ఉన్నాయి అనుకున్నవారు అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేయాలనుకుంటే అందుకు కొంత మొత్తం సెక్యూరిటీ డిపాజిట్‌గా చెల్లించాలి. ప్రజాప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 34(1) ప్రకారం అసెంబ్లీ ఎన్నికలలో పోటీ చేసే అభ్యర్థులు రూ. 10 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాలి. ఎస్సీ, ఎస్టీలకు ఈ మొత్తంలో రాయితీ ఉంది. వారు రూ. 5 వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లిస్తే చాలు. ఎస్సీ, ఎస్టీలు తమకు కేటాయించిన రిజర్వ్‌డ్ నియోజవర్గాల నుంచే కాకుండా జనరల్ నియోజకవర్గాల నుంచి పోటీ చేసినప్పుడు కూడా ఈ రాయితీ వర్తిస్తుంది. పోటీ చేసిన నియోజకవర్గంలో చెల్లుబాటైన ఓట్లలో ఆరింట ఒక వంతు సాధించిన అభ్యర్థులకు డిపాజిట్ మొత్తం వెనక్కు ఇస్తారు. ఆ మేరకు ఓట్లు సాధించని అభ్యర్థులు డిపాజిట్ కోల్పోతారు. (ఆధారం: ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా, రిప్రజెంటేషన్ ఆఫ్ పీపుల్స్ యాక్ట్-1951, భారత రాజ్యాంగం)

# ఇంకా పాలితులమేనా.. పాలకులం కావద్దా..?

భారతదేశానికి స్వాతంత్రం వచ్చి 76 సంవత్సరాలు గడుస్తున్నా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు గానీ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్, తెలంగాణకు గానీ ఒక బీసీ కూడా ముఖ్యమంత్రి కాలేదంటే అతిశయోక్తి కాదు. అటు దేశంలో ఇటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 52% ఉన్న బీసీ జనాభా నుండి ఒక ముఖ్యమంత్రి పదవి చేపడుత లేదు అంటే కారణం ఏమై ఉంటుంది? అగ్రవర్ణ పాలకులకు జెండాలు మోయాలన్నా, జై కొట్టాలన్నా, వారికి ఓట్లు వేయాలన్నా అత్యధిక జనాభా ఉన్న బీసీ వాళ్లను ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణిస్తున్నారు. ఎందుకంటే వారిలో ఐక్యత లోపించడమే కారణం అనేది స్పష్టంగా అర్థమవుతుంది. బీసీలకు అంగ బలం, అర్థ బలం, మీడియా సహకారం లేకపోవడం కూడా ఒక లోపమే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌ను జాతీయ పార్టీ అయిన కాంగ్రెస్ దాదాపు 50 సంవత్సరాలు పరిపాలన చేయడం జరిగింది కానీ ఏ ఒక్క సారి కూడా బీసీలకు అవకాశం ఇవ్వలేదు. వాస్తవానికి కాంగ్రెస్ పార్టీలో బలమైన బీసీ వర్గానికి చెందిన కొండా లక్ష్మణ్ బాపూజీ, గౌతు లచ్చన్న, పి శివశంకర్ సర్దార్, మల్లికార్జున్ గౌడ్ ఇలాంటి సమర్థవంతమైన నాయకులు ఉన్నప్పటికీ, వీరిని ఓటు బ్యాంకుగా మాత్రమే చూసి ముఖ్యమంత్రి పదవికి



దూరం చేయడం జరిగింది. అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ దేశంలోనే రెండో అతిపెద్ద జనాభా కలిగిన రాష్ట్రం అయినా, ఎస్సీ నుండి ఒకరికి అవకాశం ఇవ్వడం జరిగింది. అది కూడా రెండు సంవత్సరాలు మాత్రమే... ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో 50% పైగా ఉన్న బీసీ జనాభాను కాదని, ఏడు శాతం ఉన్న రెడ్లు 32 సంవత్సరాలు, ఐదు శాతం ఉన్న కమ్మవారు 21 సంవత్సరాలు అదే విధంగా మూడు శాతం ఉన్న వెలమలు 9 సంవత్సరాలు పరిపాలన చేయడం జరిగింది అంటే అన్ని రాజకీయ పార్టీలు బీసీలను అణగదొక్కే ప్రయత్నం చేశాయి అనడానికి ఇది నిదర్శనం. బీసీలను జాతీయ పార్టీలే కాకుండా ప్రాంతీయ పార్టీలు కూడా మోసం చేశాయన దానికి టీడీపీ, టీఆర్ఎస్, వైఎస్ఆర్సీపీలు ఉదాహరణలు. ఇవి కూడా వారి పార్టీలలో బీసీలను అణగదొక్కి ఓటు బ్యాంకు గానే చూడడం జరిగింది. భారతదేశంలో మెజార్టీ రాష్ట్రాల్లో బీసీ ముఖ్యమంత్రులను చూడడం జరిగింది కానీ ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాలలో మాత్రమే ఇప్పటికీ కూడా బీసీ ముఖ్యమంత్రి కాలేదు.. ఈ రెండు రాష్ట్రాలలో ముఖ్యమంత్రి పదవి చేపట్టాలంటే జనాభాలో అధికంగా ఉన్న బీసీలు ఐక్యంగా ఉండి సొంత పార్టీలను ఏర్పాటు చేసుకొని మన ఓట్లు మనమే వేసుకుని రాజ్యాధికారం వైపు మళ్లినప్పుడే సాధ్యమవుతుంది. ఇందుకు ఉదాహరణగా బీహార్లో నితీష్ కుమార్, లాలూ ప్రసాద్ యాదవ్ తమిళనాడులో కరుణానిధి, ఉత్తరప్రదేశ్‌లో ములాయం సింగ్ యాదవ్ వీరు ఆయా రాష్ట్రాల్లో సొంత పార్టీలను ఏకం చేసి, వారి జనాభాకు అనుకూలంగా వారి ఓట్లు వారే వేసుకొని రాజ్యాధికారం చేపట్టడం జరిగింది. ఇక్కడ కూడా ఎస్సీలను, ఎస్టీలను, మైనార్టీలను కలుపుకొని వారి జనాభా దామాషా ప్రకారంగా వారికి సీట్లు కేటాయించి ముందుకు సాగితేనే ఇది సాధ్యమవుతుంది. బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలు వీరందరు కలిపితే తెలుగు రాష్ట్రాల జనాభాలో 90 శాతానికి పైగా ఉన్నారు. వీరందరూ కలిసి ఒక పార్టీగా ఏర్పడి మన ఓట్లు మనమే వేసుకుని అధికారం వైపు పయనిస్తే తప్ప రాజ్యాధికారం అంత సులువు కాదు. అలా కాకుండా ఆయా పార్టీలలో ఉండి రాజ్యాధికారం చేపట్టాలంటే ఆ ముఖ్యమంత్రి పదవి అనేది కలగానే మిగులుతుందేమో. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చెప్పిన విధంగా పొలిటికల్ పవర్ ఇస్ ద మాస్టర్ కీ. దీనిని అనుసరించుకొని ముందుకు సాగాలని రాబోయే రోజుల్లో దళిత బహుజన రాజ్యాధికారం రావాలని మేధావులు వ్యాఖ్యానిస్తున్నారు..!

# జన్ ధన్ యోజన' (పీఎంజేడీవై) అంతా డొల్లే ..!

పేదలకు సైతం బ్యాంకింగ్ సేవలు అందుబాటులోకి తీసుకు రావడమే తన ధ్యేయమన్నాడు. అందుకే అధికారంలోకి వచ్చిన వెంటనే ఎంతో ఆర్భాటంగా 'ప్రధానమంత్రి జన్ ధన్ యోజన' (పీఎంజేడీవై) ప్రారంభించాడు. బ్యాంక్‌లో ఖాతా తెరిస్తే చాలు మీ ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుందని ప్రచారం చేశాడు. నల్ల డబ్బు మొత్తం తెచ్చి పేదల ఒక్కొక్కరి ఖాతాల్లో 15లక్షలు జమ చేస్తామని కూడా చెప్పారు. మొత్తానికి ఎంతో అద్భుతమైన పథకంగా దీన్ని ప్రచారం చేశాడు. పాపం ప్రజలు కూడా నమ్మారు. జీరో అకౌంట్ కావడంతో ఎంతో ఆశతో ఖాతాలు తెరిచారు. దీన్ని తన 'మానస పుత్రిక' అభివర్ణించుకున్నారు మన ప్రధాని. ఇప్పుడు ఆ మానస పుత్రిక ఉనికి కోల్పోతోంది. కొన్ని ఏండ్లుగా అందులో ఒక్క పైసా కూడా జమ కాలేదు. ఖాతా వద్దకు జనమూ పోలేదు. దాంతో ఈ ఖాతాలన్నీ మూసి వేసేందుకు బ్యాంకులు సిద్ధమయ్యాయి. ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ తన మొదటి పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టారు. 2014 ఆగస్టు 15న తన ప్రసంగంలో 'ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన' ప్రారంభిస్తున్నట్టు ప్రకటించారు. ఈ పథకం కింద ఖాతాదారులకు ప్రతియేటా కేంద్ర ప్రభుత్వం వోవర్ డ్రాఫ్ట్ కింద 10వేల రూపాయలు జమచేస్తుం దన్నారు. ఖాతాలో ఒక్క రూపాయి లేకపోయినా 10 వేలు విత్‌డ్రా చేసుకోవచ్చు అన్నారు. అందుకే ప్రజలు ఎంతో ఆశతో ఈ ఖాతాలను తెరిచారు. ప్రస్తుతం తెలంగాణలో 52,23,218 పీఎంజేడీవై ఖాతాలున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1,18,55,426 ఉన్నాయి. వీటిలో సుమారు 80శాతం ఖాతాల్లో




చాలా కాలం నుండి ఆర్థిక లావాదేవీలు నిలిచిపోయాయి. అందుకే ఎక్కువ శాతం ఖాతాలు ప్రస్తుతం బ్లాక్ లిస్ట్‌లోకి వెళ్లాయి. అంటే మోడీ తొలి పథకం తెల్లారినట్టేనా..? దేశంలో 42శాతం మంది ప్రజలకు అసలు బ్యాంకుల గురించే తెలియదు. అలాంటి వారందరితో ఖాతాలు తెరిపించారు. వీరంతా పూట గడవడానికి పొట్ట చేతబట్టుకొని వలసలు వెళ్లేవారు. అలాంటి వారు బ్యాంకు ఖాతాలు ఎలా నిర్వహిస్తారు? కూలీ చేస్తే వచ్చే ఆ కొద్ది మొత్తం కడుపు నింపుకోవడానికే సరిపోదు. ఇక బ్యాంకుల్లో ఎలా దాచుకుంటారు. అకౌంట్ ఓపెన్ చేస్తే రుణాలు వస్తాయని, ప్రధాని తమకు డబ్బులు వేస్తాడని ఆశపడ్డారు. ఆ డబ్బుతో పంటలు పండించుకోవచ్చని అనుకున్నారు. వేల రూపాయలు వడ్డీలు కట్టే బాధ తీరి పోతుందనుకున్నారు. కానీ వారి ఆశలు అడియాశలే అయ్యాయి. ఇప్పుడేమో ఖాతాలు ఖాళీగా ఉన్నాయని బ్యాంకులు ఖాతాదారులకు అల్టిమేటం ఇస్తున్నారు. అక్షరం ముక్క రాని వారికి వీటి గురించి ఎలా తెలుస్తుంది? బ్యాంకులేమో ఆ అకౌంట్లను సేవింగ్ ఖాతాల కింద మార్చుకోమని ఉచిత సలహాలు ఇస్తున్నారు. మూలిగే నక్క మీద తాటికాయ పడ్డట్టు ఉంది ఇప్పుడు ఆ ఖాతాదారుల పరిస్థితి. ఒకపక్క చేసుకోవడానికి పనిలేక, తింటానికి తిండి లేక అల్లాడిపోతున్నారు. ఇలాంటి స్థితిలో వీటిని సేవింగ్ ఖాతా కిందకు మార్చితే అందులో కచ్చితంగా మినిమమ్ బ్యాలెన్స్ పెట్టాలి. లేదంటే బ్యాంకుకు ఫైన్లు కట్టాలి. పాపం ఈ విషయాలేమీ తెలియక, బ్యాంకు వాళ్ళకు సమాధానం చెప్పలేక ఖాతాదారులు మౌనంగా ఉండిపోతున్నారు. నిత్యం అదానీ, అంబానీల జపం చేసే మన ప్రధానికి ఇవేవీ పట్టవు. ప్రధానమంత్రి జన్‌ధన్ యోజన కింద ఖాతాదారులకు అందే ఒకే ఒక ప్రయోజనం ఏమైనా ఉందీ అంటే అది బీమా క్లెయిమ్. పథకం కింద ఖాతాదారులకు ప్రమాద బీమా రక్షణ లభిస్తుంది. గతంలో ఈ కవరేజ్ కింద లక్ష రూపాయలు ఉండేది. ప్రస్తుతం అది రెండు లక్షలకు పెంచారు. పెంచనైతే పెంచారు కానీ దీన్ని ఉపయోగించుకునే సంగతేంటి? ఈ ఖాతాదారులకు బ్యాంక్ ఖాతాతో పాటు 'రూపే డెబిట్ కార్డు' కూడా ఇచ్చారు. ప్రమాద బీమాకు ఈ కార్డు చాలా ముఖ్యం. ప్రమాదం జరిగిన రోజుకు ముందు 90రోజులలోపు, ఆ ఖాతాదారు తన రూపే కార్డును ఉపయోగించి ఏదైనా లావాదేవీ జరపాలి. అప్పుడే అతను ప్రమాద బీమాను క్లెయిమ్ చేసుకోడానికి అర్హుడు. లేదంటే క్లెయిమ్ తిరస్కరణకు గురవుతుంది. ఖాతాలో డబ్బులేకపోతే ఇక లావాదేవీలు ఎలా చేస్తారు? అందుకే ఎంతో మంది ఈ బీమాకు కూడా నోచుకోలేకపోయారు. 'చూసుకొని మురవ చెప్పుకొని ఏడ్వ' అన్నట్టు తయారయింది ప్రస్తుతం జన్‌ధన్ ఖాతాలు, రూపే డెబిట్ కార్డుల పరిస్థితి. ఈ ఖాతాలు తెరవడం వెనుకున్న ప్రధాని అసలు ఆంతర్యం ఏంటో ప్రజలకు ఇప్పుడిప్పుడే తెలుస్తోంది. డిజిటల్ ఇండియా అంటూ ఎప్పుడూ జపం చేసే ప్రధాని గుట్టు బయటపడింది. డెబిట్ కార్డులు మన చేతిలో పెట్టి, డిజిటల్ లావాదేవీలు పెంచి కార్పొరేట్ల వ్యాపారానికి ఎలాంటి అడ్డంకులు లేకుండా చేసేందుకే అని తెలిసిపోయింది. శ్రమ జీవులతో బ్యాంకు ఖాతాలు ఓపెన్ చేసి ఆ అకౌంట్లలో ఉన్న కొద్ది మొత్తం కూడా కార్పొరేట్లకు కట్టబెట్టేందుకే అని అర్థమవుతోంది. పథకం చెప్పుకునేందుకు గొప్పగానే ఉంది. లోపల చూస్తే కనబడుతుంది అంతా డొల్లే అని.

## సి-విజిల్ ఫిర్యాదులపై నిర్లక్ష్యం

జిల్లాలో సార్వత్రిక ఎన్నికలు పారదర్శకంగా నిర్వహిస్తామని అధికారులు చెబుతుంటే.. నెల్లూరు నగరపాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన జిల్లా కంట్రోల్ రూమ్‌కు వస్తున్న ఫిర్యాదులపై కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. సి-విజిల్‌కు వచ్చిన ఫిర్యాదులను వంద నిమి షాల్లో పరిష్కరించాల్సి ఉంది. సి-విజిల్ యాప్ ఫ్లయింగ్‌స్క్వాడ్ అధికారిగా పని చేస్తున్న ఇరిగే షన్ ఏఈ, ఇద్దరు కానిస్టేబుళ్లకు బాధితులు ఫోన్ చేసినా స్పందించలేదు. అనంతరం కార్యా లయానికి వచ్చిన వారిని జిల్లా కంట్రోల్ కేంద్రం హెడ్ ప్రశ్నించగా దురుసుగా సమాధా నం ఇవ్వడంతో పాటు, ఫిర్యాదును కూడా వినకుండా కారులో వెళ్లిపోయినట్లు చెబుతు న్నారు. ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శిం చడంపై పలువురు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

## నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు


నేర నియంత్రణకు పటిష్ఠ చర్యలు తీసుకోవాలని ఎస్పీ కె.ఆరిఫ్ హఫీజ్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఆయన నగరంలోని చిన్నబజారు, నవాబుపేట, బాలాజీనగర్, నెల్లూరు రైల్వేస్టేషన్‌తో పాటు ఆర్ఎస్ఆర్ స్కూలులోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా పోలీసులు చర్యలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు. పగలు, రాత్రి గస్తీని ముమ్మరం చేసి నేరాలను కట్టడి చేయాలన్నారు. నామినేషన్ కేంద్రాల వద్ద భద్రతను కట్టుదిట్టం చేయాలని ఆదేశించారు. ఎన్నికల ఉల్లంఘనులపై చర్యలు తీసుకోవాలన్నారు. రైళ్లలో నగదు, మద్యం అక్రమ రవాణా జరగకుండా తనిఖీలు ముమ్మరం చేయాలని సూచించారు. ఎస్పీ వెంట ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ కె.రామ కృష్ణారెడ్డి, చిన్నబజారు, నవాబుపేట, బాలాజీనగర్ ఇన్‌స్పెక్టర్లు బి.అశోక్ కుమార్, ఎం.బాబీ, వీరా నాయక్, రైల్వే ఎస్సై ఎస్.హరిచందన తదితరులు పాల్గొన్నారు.

## నోరూరించే పండ్లు!.. రసాయనాలతో కడగండ్లు..!

ప్రకృతి మానవుడికి ప్రసాదించిన గొప్ప వరం..పండ్లు. మంచి ఆరోగ్యానికి అవి ఎంతగానో ఉపయోగపడతాయి. అందుకే పండ్లు బాగా తినండి..ఆరోగ్యంగా ఉండండి అని మన పెద్దలు చెప్తూ ఉంటారు. అయితే, ఇప్పుడా కాలం పోయింది. పండ్లు తింటే ఆరోగ్యంగా ఉంటామన్న గ్యారంటీ ఏమీ లేదు. ఎక్కడ చూసినా కల్తీలు, నాశిరకం తిండ్లు వెల్లువెత్తుతున్న నేటి సమాజంలో 'మంచి పండ్లు' దొరుకుతా యనుకోవడం కూడా కేవలం ఒక భ్రమగానే ఉంటోంది. డబ్బులిచ్చి మరీ అనారోగ్యాన్ని చేతులారా మనమే కొనుక్కుంటున్నామా అనిపిస్తోంది. ఇది, ఏ ఒక్కచోటో కాదు, దేశ వ్యాప్తంగా అనేక మార్కెట్లలో ఈ బాగోతం నడుస్తూనే ఉంది. అనేకమంది వ్యాపారులు తమ స్వలాభం కోసం, ఏదోఒక విధంగా కోట్లు సంపాదించాలనే స్వార్థంతో ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెట్టేస్తున్నారు. ఆరోగ్యకరమైన పండ్లను కూడా రసాయనాలతో కలిపి అటు వాటినీ, ఇటు ప్రజల ఆరోగ్యాన్ని కూడా నాశనం చేస్తున్నారు. ఎవరెటుపోతే మాకేం..మాకు కావాల్సింది డబ్బే అన్న నినాదంతో, అక్రమవ్యాపారులు పండ్ల వ్యాపారాన్ని కూడా విషతుల్యం చేస్తున్నారు. ప్రజల ఆరోగ్యానికి ముప్పు అని తెలిసినా కల్తీవ్యాపారులు పట్టించుకోవడం లేదు. అడ్డదారుల్లో రసాయనాలను వినియోగిస్తూనే ఉన్నారు. ఆ విషయం తెలిసి పండ్ల మార్కెట్లపై అధికారులు దాడులు చేస్తున్నా, జరిమానాలు విధిస్తున్నా లెక్కచేయడం లేదు. అలాంటి అనైతిక, అక్రమ వ్యాపారాలు చేయొద్దని ఒకవైపు న్యాయస్థానాలు, మరోవైపు ప్రభుత్వాలు ఎన్నిసార్లు హెచ్చ రిస్తున్నా అక్రమార్కుల తీరు మారడం లేదు. ప్రజారోగ్యాన్ని మట్టుపెడుతున్న ఇలాంటి అక్రమవ్యాపారులపై కఠిన చర్యలు తీసుకుంటే తప్ప, దేశంలో ఈ దుస్థితి మారేలా లేదు. అందులోనూ ఈ వేసవిలో రకరకాల పండ్లకు మార్కెట్లో డిమాండ్ బాగా ఉంటుంది. ఇదే అదనుగా వ్యాపారులు తమ అక్రమార్జనకు తెరతీస్తున్నారు. ముఖ్యంగా ఈ సీజన్‌లో మామిడిపండ్లు చూస్తే ఎవరికైనా నోరూరుతుంది. మధుర ఫలంగా పేరుగాంచిన మామిడిపండ్లు బంగారు రంగుతో నిగనిగలాడుతుంటాయి. తీరా వాటిని కొని, ఇంటికి తీసుకు వెళ్ళి తింటే.. ఇంట్లో ఉన్న బంగారాన్ని కూడా ఆసుపత్రులకు పెట్టాల్సిన దుస్థితి. ఎందుకంటే, మార్కెట్లోకి వచ్చే అనేక పండ్లలో అధికశాతం విషపూరితమైన రసాయనాలతో ఉంటున్నాయని ఆహారభద్రతా అధికారులు కూడా హెచ్చరిస్తున్నారు. పండ్లు పక్వానికి రాకముందే, అవి మంచి రంగుతో నిగనిగలాడుతూంటే ఎక్కువమంది కొంటారనే దురాశతో అక్రమవ్యాపారులు రహస్యంగా వాటిని రసాయనాలతో కలిపి, అసహజమైన రీతిలో వాటిని పక్వానికి వచ్చేలా చేస్తున్నారని, కనుక వినియోగదారులు జాగ్రత్తగా ఉండాలని చెప్తున్నారు. మెరిసిపోయే యాపిల్, పసుపువర్ణంలో మామిడి, పసుపు పచ్చగా ఉండే అరటిపండ్లు వంటివి.. అలా మంచి రంగుతో అందరినీ ఆకట్టుకునేలా, తద్వారా తమ వ్యాపారం మూడు కాయలు.. ఆరుపండ్లు అన్నట్లుగా జరిగేలా వ్యాపారులు ఈ మోసాలకు పాల్పడుతున్నారు. వాస్తవానికి సాధారణ ప్రజలే కాదు, విజ్ఞులైనవారు కూడా మార్కెట్లలో తరచూ మోసపోతూనే ఉంటారు. అందమైన పండ్ల మాటున అనారోగ్యం పొంచి ఉంటుందని ఎవరనుకుంటారు?.. కానీ, ఈ కలికాలంలో.. కల్తీకాలంలో, వ్యాపారుల మాయాజాలంలో ఏది అసలీయో..ఏది కల్తీయో కనిపెట్టడం అంత సులభం కాదు. రానురాను రసాయనాలు లేని పండ్లు దొరకడం కూడా కష్టంగానే ఉంటోంది. అందరూ ఎక్కువగా కోరుకునే మామిడి, పైనాపిల్, సపోటా, ద్రాక్ష, బొప్పాయి వంటి పండ్లు కూడా మార్కెట్లలో చూసేందుకు భలే బాగుంటున్నా, వాటిని త్వరగా మగ్గబెట్టేందుకు కాల్షియం కార్బైడ్, ఇథిలిన్ వంటి రసాయనాలు వాడుతున్నారని, దాంతో వాటిలో ఉండే పోషకపదార్థాలు కూడా దెబ్బతిని, తిన్నవారికి జబ్బులు వస్తున్నాయని, అలాంటి పండ్లను తినడం వల్ల వాంతులు, విరోచనాలు, జీర్ణకోశ వ్యాధులు, కిడ్నీ జబ్బులు వంటివెన్నో వస్తాయని, కనుక జాగ్రత్త తప్పదంటున్నారు నిపుణులు. అందువల్ల రసాయనాలు కలిపిన పండ్లను గుర్తించాలని, మామూలు పండ్లకి-రసాయనాలు కలిపిన పండ్లకీ తేడా ఉంటుందని పేర్కొంటున్నారు.ఎందుకైనా మంచిది. మార్కెట్ నుంచి తెచ్చుకున్నాక ఆ పండ్లను ఉప్పునీటిలో కొంతసేపు బాగా నానబెట్టి, ఆ తర్వాత శుభ్రం చేసుకుని తినడం కొంతలో కొంతైనా శ్రేయస్కరమని సూచిస్తున్నారు. ఏదేమైనా ప్రజల ఆరోగ్యాన్ని దెబ్బతీసే ఇలాంటి మోసాలను, అరికట్టేందుకు ప్రభుత్వాలు మరింత కఠినచర్యలు తీసుకోవాల్సి ఉంది. అవసరమైతే, చట్టాలను సవరించైనా సరే, ఈ అక్రమాలను నిరోధించాల్సి ఉంది.

# ఫ్యాన్ ప్రభంజనంతో టీడీపీ ఆశలు గల్లంతు..?

ఏపీలో ఎక్కడ చూసినా వైసీపీ హవా కనిపిస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మరోసారి అధికారమే లక్ష్యంగా వైసీపీ ప్రచారంలో దూసుకెళ్తుంది. సీట్ల ప్రకటన మొదలు ఇవాళ్టి వరకు ఫుల్ జోష్‌లో ఉంది. ముందుగానే అభ్యర్థులను ప్రకటించి విపక్ష పార్టీలకు షాక్ ఇచ్చిన వైసీపీ విజయం కోసం తీవ్రంగా శ్రమిస్తోంది. ఈ క్రమంలోనే ఏపీలో మళ్లీ వచ్చేది జగన్ ప్రభుత్వమేనని టాక్ వినిపిస్తోంది. అత్యధికంగా లోక్ సభ స్థానాలను సాధించడంతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ విజయదుంధుభి మోగించనుందని తెలుస్తోంది. ఇప్పటికే పలు సంస్థలు మరోసారి వైసీపీ సర్కార్ వస్తుందని చెప్పగా.. తాజాగా 147 స్థానాల్లో వైసీపీ గెలిచే అవకాశం ఉందని ప్రతిపక్ష పార్టీ తేల్చి చెప్పడం రాష్ట్ర రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఎన్నికలకు ఇంకా మరికొన్ని రోజులు సమయం ఉన్నప్పటికీ ప్రతిపక్ష టీడీపీ ఓటమిని ఒప్పుకుంది. రాష్ట్రంలో ఉన్న 175 అసెంబ్లీ నియోజకవర్గాల్లో దాదాపు 147 స్థానాల్లో వైసీపీ విజయం తథ్యమని స్పష్టం చేసింది. నేషనల్ మీడియా సంస్థలతో పాటు మరికొన్ని సంస్థలు వెలువడించిన సర్వే ఫలితాలే కాకుండా ఇప్పుడు టీడీపీ ఇంటర్నల్ సమావేశంలోనూ ఇదే బయట పడింది. టీడీపీ నిర్వహించిన పవర్ పాయింట్ ప్రజెంటేషన్ లో స్వయంగా ఆ పార్టీ స్టేట్ ఎలక్షన్ సెల్ కోఆర్డినేటర్ కోనేరు సురేశ్ నేతలకు వివరించారు. 147 అసెంబ్లీ స్థానాల్లో వైసీపీ సుమారు రెండు శాతం ఓట్ల తేడాతో ముందంజలో ఉందని టీడీపీ నేతలకు తెలిపారు. వీటిలో ముఖ్యంగా 28 నియోజకవర్గాల్లో టీడీపీ కూటమిపై



సుమారు పది లక్షల ఓట్ల తేడాతో వైసీపీ విజయ పథంలో కొనసాగే ఛాన్సెస్ ఉన్నాయని పేర్కొన్నారు. అంతేకాదు టీడీపీ – బీజేపీ –జనసేన కలిసి వెళ్లినా వైసీపీని ఢీకొట్టడం సాధ్యమయే పని కాదని తేల్చడం గమనార్హం. అయితే, సామాజిక చైతన్య బస్సు యాత్ర, వై ఏపీ నీడ్స్ జగన్, ఆడుదాం ఆంధ్రా వంటి పలు రకాలు కార్యక్రమాలను నిర్వహించిన వైసీపీ నిత్యం ప్రజలతో మమేకం అవుతూ వస్తుంది. ఆ తరువాత ఏపీలో నాలుగు చోట్ల 'సిద్ధం' పేరిట సభలను నిర్వహించిన వైసీపీ సరికొత్త రికార్డును క్రియేట్ చేసిందనడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. ఈ సభలను నిర్వహించిన సమయంలోనే వైసీపీ గెలుపు ఖాయమని తేలిపోయింది. నవరత్నాల అమలు, మ్యానిఫెస్టోను 99 శాతం అమలు చేయడంతో పాటు విద్య, వైద్య రంగాల్లో తీసుకొచ్చిన కీలక సంస్కరణలతో రాష్ట్ర ప్రజలంతా వైసీపీ వైపే మొగ్గు చూపుతున్నారు. నాణ్యమైన విద్య, ఇంటి వద్దకే వైద్యం, సొంతింటి కల నెరవేర్చిన జగన్ ను పేద ప్రజలు తమ ఇంటిలో సభ్యునిగా భావిస్తున్నారు. కులం, మతం, పార్టీ మరియు ప్రాంతాలతో సంబంధం లేకుండా సంక్షేమ పథకాలు అందించడంతో ఆయన జనహృదయాల్లో చెరగని ముద్ర వేసుకున్నారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా ఫ్యాన్ గాలి బాగా వీస్తుంది. మరోవైపు చంద్రబాబు బీజేపీ, జనసేనతో కలిసి వెళ్తున్నప్పటికీ ప్రజల నుంచి స్పందన కరువైంది. సభలకు సైతం జనాలు రాకపోవడంతో పార్టీ క్యాడర్ లో నిరుత్సాహం పెరిగిపోతుంది. పొత్తు నేపథ్యంలో పలు ప్రాంతాల్లో సీట్ల వ్యవహారంలో రభస జరిగింది. క్షేత్రస్థాయిలో క్యాడర్ లో సమన్వయం కొరవడింది. మరికొన్ని ప్రాంతాల్లో టీడీపీ కూటమిలో తిరుగుబావుటా మొదలు కావడంతో పాటు సర్వే ఫలితాల్లోనూ వైసీపీదే విజయం అని తేలడంతో టీడీపీ నిరాశలో కూరుకుపోయింది. ఈ క్రమంలోనే తాజాగా టీడీపీ ఇంటర్నల్ సమావేశంలో వైసీపీ గెలుపును తేల్చుతూ బయటకు వచ్చిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. దీంతో అక్కడో ఇక్కడో టీడీపీ క్యాడర్‌లో ఉన్న చిగురాశలు కూడా ఆవిరైయ్యాయి. ఈ నేపథ్యంలో ప్రజాదరణ ఉన్న జగన్ మరోసారి అధికార పీఠాన్ని కైవసం చేసుకుంటారని అర్థం అవుతుంది.

ఫీడ్ బ్యాక్ టు ఆంధ్రలక్ష్మి

'ఆంధ్రలక్ష్మి' వారపత్రికకు సమాజంలో జరిగే అవినీతి, అక్రమాలు మీ దృష్టికి వస్తే మాకు తెలియజేయండి.... మేము నిర్భయంగా ప్రచురిస్తాం...
మీ వివరాలు గోప్యంగా ఉంచుతాం.


Cell : 9640300529

వార్తలకై www.andhralaxmitelugu.in చూడండి

email : Andhralaxminews@gmail.com
www. andhralakshmi@gmail.com, facebook.com/andharalaxmi

# ఎలాగైనా వెళ్లాలి.. ఏపీలో ఓటెయ్యాలి..!

ఎన్నికల నేపథ్యంలో మే నెలలో ప్రయాణాలు భారీగా పెరగనున్నాయి. ఉద్యోగం, ఉపాధి కోసం ఇతర ప్రాంతాల్లో ఉంటున్నవారు ఎన్నికల్లో ఓటేసేందుకు స్వస్థలాలకు వెళ్లేందుకు సిద్ధం అవుతున్నారు. ముఖ్యంగా దూరప్రాంతాలకు వెళ్లాల్సినవారు రైలు ప్రయాణాలకు ప్రాధాన్యమిస్తున్నారు. హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్‌తో పాటు రాష్ట్రంలో పలు జిల్లాల నుంచి ఏపీ వైపు వెళ్లే రైళ్లకు భారీగా డిమాండ్ ఏర్పడింది. మే 13న తెలుగు రాష్ట్రాల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. అదే రోజు ఏపీలో అసెంబ్లీ ఎన్నికలు కూడా జరగనున్నాయి. పోలింగ్ సోమవారం జరగనుండటంతో చాలామంది ఆదివారం బయల్దేరేందుకు ప్రణాళికలు రూపొందించుకున్నారు. పోలింగ్ రోజుకు రిజర్వేషన్లు దొరక్క కొందరు మూడు రోజుల ముందు కూడా ప్రయాణాలు పెట్టుకుంటున్నారు. అయినా సరే రైళ్లలో రిజర్వేషన్లు పూర్తయిపోయాయి. హైదరాబాద్ వైపు నుంచి విజయవాడ, నర్సాపురం, కాకినాడ, విశాఖపట్నం వెళ్లే రైళ్లలో మే 12న రిజర్వేషన్లు పూర్తయిపోయాయి. నెల్లూరు, తిరుపతి వైపు మార్గంలోనూ దాదాపు ఇదే పరిస్థితి. శుక్రవారం, శనివారం (మే 10, 11 తేదీలు) కూడా దూర ప్రాంత రైళ్లలో ఒక్కో బండిలో వందల సంఖ్యలో వెయిటింగ్ లిస్టు ఉంది. కొన్నింట్లో అయితే ఆ పరిమితి కూడా దాటిపోయి 'రిగ్రెట్' వస్తోంది. అన్ని ఏసీ బోగీలు, అధిక ఛార్జీలుండే సికింద్రాబాద్–విశాఖపట్నం వందేభారత్ ఎక్స్‌ప్రెస్‌లో




సాధారణంగా అయితే ఒక రోజు ముందు కూడా రిజర్వేషన్ దొరుకుతుంది. ఎన్నికలు ఉండటంతో నెలరోజుల ముందే టికెట్లు అయిపోయాయి. 12వ తేదీకి గరీబ్‌రథ్‌లో వెయిటింగ్ లిస్ట్ 234. స్లీపర్‌లో గమనిస్తే గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో 265 మంది, ఫలక్‌నుమాలో 240 మంది, విశాఖ ట్రైన్‌లో 182 మంది, ఈస్ట్‌కోస్ట్‌లో 180 మంది వెయిటింగ్ లిస్టులో ఉన్నారు. 11వ తేదీన గౌతమి ఎక్స్‌ప్రెస్‌లో స్లీపర్, ఏసీల్లో కలిపి 592 మంది వెయిటింగ్ లిస్టులో ఉన్నారు. సికింద్రాబాద్ నుంచి వెళ్లే నారాయణాద్రి, శబరి, చార్మినార్, పద్మావతి, చెన్నై ఎక్స్‌ప్రెస్, వెంకటాద్రి, రాయలసీమ ఎక్స్‌ప్రెస్, తిరుపతి స్పెషల్ వంటి రైళ్లలో మే 10, 11, 12 తేదీల్లో భారీగా వెయిటింగ్ లిస్టు ఉంది. ఎల్‌టీటీ–విశాఖ ఎక్స్‌ప్రెస్ మే 9–12 వరకు నాలుగు రోజులు రిగ్రెట్‌లో ఉంది. 11, 12 తేదీల్లో కోణార్క్, జన్మభూమి.. ఇలా పలు రైళ్లు రిగ్రెట్‌లో ఉన్నాయి. వేసవిలో ప్రత్యేక రైళ్లు నడిపిస్తున్నామని ద.మ.రైల్వే చెబుతున్నా..రద్దీతో పోలిస్తే ఆ సంఖ్య తక్కువే. పైగా ప్రయాణికుల డిమాండ్ ఉన్న రూట్లలో కాకుండా బిహార్, బెంగాల్ వంటి రాష్ట్రాలవైపు ఉంటున్నాయి. ఏ రైలుకు ఎంత డిమాండ్ ఉంది..ఎన్ని వందల మంది వెయిటింగ్‌లో ఉన్నారన్న ముందస్తు సమాచారం ఉంటుంది కాబట్టి ఆ ప్రకారం ఆయా రోజుల్లో ప్రత్యేక రైళ్లు నడపవచ్చు. అవే రూట్లు, దాదాపు అవే సమయాల్లో ప్రత్యేక రైళ్లను వేస్తే వాటిని క్లోన్ రైళ్లుగా వ్యవహరిస్తారు. ఎన్నికల తేదీకి రెండు, మూడు రోజుల ముందు కాకుండా వెయిటింగ్ లిస్టుకు అనుగుణంగా వెంటనే క్లోన్ రైళ్లను ప్రకటిస్తే ఇటు ప్రయాణికుల్లో ఆందోళన తగ్గడంతో పాటు రైల్వేకూ ఆదాయం వస్తుంది. అలాగే రైలుకు గరిష్ఠంగా 24 బోగీలు ఉంటాయి. డిమాండ్ బాగా ఉన్న రైళ్లకు తక్కువ బోగీలు ఉన్న పక్షంలో వాటికి అదనంగా జోడించే విషయాన్నీ పరిశీలించవచ్చు.

## ఖలీల్ అహ్మాద్ విషయంలో పార్టీ ధోరణి బాధాకరం..!

నెల్లూరు సిటీ నియోజకవర్గం వైకాపా అభ్యర్థి ఖలీల్ అహ్మద్ విషయంలో ఆ పార్టీ ధోరణి బాధాకరంగా వుంది. నగరంలో ఎన్నికల ఆఫీసులు పెడుతున్నారు కానీ, వాటిలో ఖలీల్ బొమ్మ లేదు. అన్నీ మాజీ ఎమ్మెల్యే అనిల్ ఫోటోలతో నింపేస్తున్నారు. ప్రచార సభలలో కానీ, ఇతరత్రా కార్యక్రమాలలో కానీ ఖలీల్ బ్యాక్ బెంచర్ అయి పోతున్నాడు. వేదిక మీద కార్యకర్తలలో ఒకరుగా నిలబడుతున్నాడు తప్ప, పోటీలో వున్న అభ్యర్థిగా కన్పడడం లేదు. ఆ అవకాశం వైకాపా నేతలు ఇవ్వడం లేదు. ఒక ముస్లిం నెల్లూరు సిటీ అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం ఇవ్వడం ఆనందించదగిన నిర్ణయంబీ కానీ దానిలో చిత్తశుద్ధి వుంటేనే ఫలితం. అది ఏ కోశానా కన్పించడం లేదు. ఎమ్పీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న విజయసాయిరెడ్డి కానీ, ప్రతి నియోజకవర్గంలో పరిస్థితులను నిశితంగా పరిశీలిస్తున్న పికె టీం సభ్యులు కానీ ఖలీల్‌కు జరుగుతున్న అన్యాయాన్ని గుర్తించడం లేదు. గుర్తించినా పట్టించుకోవడం లేదేమో తెలియదు.

తేది : 22- 04-2024 ఆంధ్రలక్ష్మి 6 సంపుటి : 15 సంచిక : 32

# ఆంధ్రప్రదేశ్ గతం ఘనకీర్తి వర్తమానం అపకీర్తి..!




ఆంధ్రప్రదేశ్ ఏర్పడి పుష్కర కాలం పూర్తి కాగానే, తెలంగాణలో అసంతృప్తి మొదలై అది ఆత్మాభిమాన ఉద్యమంగా ఊపందుకుంది. కోస్తాంధ్ర ప్రాంతంవారు తమ ఉద్యోగాలను ఆక్రమించారని, తమ భాషను, యాసను, ఆహారాన్ని, తమ జీవన విధానాన్ని కించపరిచారని, నీటివాటా లో తమకు అన్యాయం జరిగిందని తెలంగాణ వాసుల్లో అసంతృప్తి పెల్లుబికి జై తెలంగాణ ఉద్యమంగా రూపుదాల్చింది. చివరికది తీవ్రతరమై, హింసారూపం కూడా దాల్చింది. జై తెలంగాణ తమ ఆత్మాభిమానానికి సంకేతమని వారు భావించారు. 'జై తెలంగాణ' ఉద్యమం చల్లబడగానే, దానికి ప్రతిస్పందనగా కోస్తాంధ్రలో 'జై ఆంధ్ర' ఉద్యమం 1972లో మొదలైంది. ఈ జై ఆంధ్ర ఉద్యమంలోనే వెంకయ్యనాయుడు వంటి వారు నాయకులుగా నిలదొక్కుకున్నారు. నాయకులుగా వీరు జాతీయ స్థాయికి ఎదగడమే తప్ప, ఆంధ్ర ప్రాంత అభివృద్ధికి పెద్దగా కృషి చేసిన దాఖలాలు ఏమీ లేవు. ఇరవై రెండేళ్ళ క్రితం మళ్ళీ 'ప్రత్యేక తెలంగాణ ఉద్యమం' మొదలైంది. 'జై తెలంగాణ' ఉద్యమంలో లాగా ఎక్కడా హింసాత్మక సంఘటనలు జరగలేదు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమానికి ప్రతిగా ఆంధ్ర ప్రాంతంలో కూడా సమైక్య ఉద్యమం అంటూ ఒక ప్రాయోజిత ఉద్యమం మొదలైంది. అది 'సభ్యత' అనే హద్దులను దాటేసింది. 'ప్రత్యేక తెలంగాణ ఉద్యమం' పదేళ్ళ క్రితం ప్రత్యేక రాష్ట్ర సాధనతో ముగిసింది. తమిళుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా, ఆత్మాభిమానం కోసం ఉద్యమించి, ప్రత్యేక ఆంధ్ర రాష్ట్రాన్ని సాధించినట్టు గానే, తెలంగాణ కూడా 2014లో ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించుకుంది.తెలంగాణతో ఎడబాటు వల్ల ఆంధ్ర ప్రాంత వాసులకు కొంత బాధ కలిగిన మాట వాస్తవమే. కానీ, ఒక తెలుగు రాష్ట్రం రెండు తెలుగు రాష్ట్రాలుగా ఏర్పడినంత మాత్రాన కొంపలంటుకుపోయినట్టు గగ్గోలు పెట్టడం సరికాదు. దాన్ని ఘోరమైన నేరంగా పరిగణించకూడదు. ఒక ప్రాంతపు ఆత్మాభిమానాన్ని గౌరవించడం అనేది రాజనీతిజ్ఞత. హైదరాబాదులో పెట్టుబడులు పెట్టి, దాన్ని మేమే అభివృద్ధి చేశాం కనుక, దానిపైన రాజకీయాధికారం మాకే ఉండాలని, ఉమ్మడి రాజధానిగా ఉండాలని, ఆంధ్ర ప్రాంతంలో కొందరు నాయ కులు వాదనలను తీసుకొచ్చారు. కనీసం కేంద్ర పాలిత ప్రాంతంగానైనా చేయండంటూ కేంద్ర ప్రభుత్వానికి మహాజర్లు సమర్పించారు. ఇలా చేయడం తెలంగాణ ప్రాంత ప్రజలు చేసిన ఆత్మాభిమాన పోరాటాన్ని అవమానించడమే అవుతుంది. అసలు దక్షిణ భారతదేశానికే తలమానికం లాంటి హైదరాబాదు నగరాన్ని కేంద్రం చేతికి అప్పగించడమంటే రెండు తెలుగు రాష్ట్రాల ప్రజల ఆత్మాభిమానాన్ని ఢిల్లీ పాలకులకు తాకట్టు పెట్టి, అక్కడి పెద్దలకు దాసోహమనడమే అవుతుంది. ప్రపంచ దేశాల్లో భారత దేశానికి ఒక ప్రత్యేకమైన గౌరవం, గుర్తింపు ఉంది. ఈ గౌరవం, గుర్తింపు తరతరాలుగా ఇక్కడి బహుళత్వం వల్లనే సిద్ధించింది. భారత దేశంలో భిన్నజాతులు, భిన్న మతాలు, భిన్న కులాల వారు తరతరాలుగా సహజీవనం సాగిస్తున్నారు. కేంద్రంలో గత పదేళ్ళుగా అధికారంలో ఉన్న బిజెపి పాలనలో ఈ బహుళత్వానికి ముప్పువాటిల్లిందని రొమిల్లా థాపర్ వంటి చరిత్ర కారులు, ఇతర మేధావులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భిన్నత్వం ఉన్న భారత దేశంలో ఒకే జాతి, ఒకే మతం, ఒకే భాష, ఒకే ఆహారం వంటి నియంతృత్వ ధోరణులను ప్రవేశపెట్టడానికి బిజెపి ప్రయత్నిస్తోంది. అందుకోసం రాజ్యాంగాన్ని కూడా సవరించాలని భావిస్తోంది. ముఖ్యంగా రాజ్యాంగంలో ఉన్న లౌకికత్వం, సామ్యవాదం అన్న పదాలను తొలగించాలని ఆ పార్టీ నేతలు ఇప్పటికే సంకేతాలు పంపుతున్నారు. ఈ ఎన్నికల్లో బిజెపి 400 స్థానాలను గెలుచుకున్నట్టయితే రాజ్యాంగాన్నే మార్చే సే ఆలోచనలో ఆ పార్టీ ఉంది. బిజెపి పాలనలో మైనారిటీలు అభద్రతా భావానికి లోనవుతున్నారు. వారిని రెండవ శ్రేణి పౌరులుగా చేయాలని బిజెపి ప్రయత్నిస్తోంది. బిజెపి పాలిత రాష్ట్రాల్లో శ్రీరామనవమి సందర్భంగా కాషాయ జెండాలు, కత్తులు పుచ్చుకుని మైనారిటీ మతస్థులు నివసించే ప్రాంతా ల్లో శోభాయాత్ర పేరుతో వారిని రెచ్చగొట్టే చర్యలకు పాల్పడ్డారు. వారిని అవమానిస్తూ, వారి ప్రార్థనాలయాలపైన దాడులు చేశారు. మైనారిటీలు ఆత్మరక్షణ చర్యలకు పాల్పడితే, వారిపైన కేసులుపెట్టి, వారి ఇళ్ళను బుల్డోజర్లతో ధ్వంసం చేశారు. తమని వ్యతిరేకించే వారందరినీ 'దేశద్రోహులు'గా ముద్ర వేశారు. పోర్టులు, పరిశ్రమల వంటి దేశ సంపదను అదానీ, అంబానీలవంటి పారిశ్రామిక దిగ్గజాలకు కారుచౌకగా అప్పగించేస్తున్నారు. అనేక నిరంకుశ చట్టాలను తేవడమే కాకుండా, పాత నిరంకుశ చట్టాలకు దుమ్ము దులిపి అమలు చేస్తున్నారు. దేశం ఇలా పదేళ్ళుగా బిజెపి పాలనను చవిచూస్తోంది. ఇలాంటి చర్యల వల్ల విదేశాల్లో ఉండే హిందువులు అభద్రతకు లోనవుతున్నారు. మెజారిటీ మతస్థుల ఆధిపత్యాన్ని అంగీకరించకపోతే మైనారిటీలు దేశం విడిచి వెళ్ళిపొమ్మనే సంకేతాలు ఆ పార్టీ నాయకుల నుంచి బాహాటంగా వినవస్తున్నాయి. దక్షిణాసియా దేశాల్లో భారత్ మినహా మిగతా అన్ని దేశాలూ మత రాజ్యాలే. ఆయా దేశాల్లో అధికార మతానికి భిన్నంగా ఏ ఒక్కటీ జరగడానికి వీలు లేదు. మతం వ్యక్తిగతం చేసిన ఒక్క భారత దేశం మాత్రమే లౌకిక రాజ్యం గా మనగలుగుతోంది. భారత దేశాన్ని కూడా మిగతా దక్షిణాసియా దేశాలవలే మతరాజ్యంగా తయారు చేస్తే ప్రపంచదేశాల్లో భారత దేశానికున్న ప్రత్యేక గౌరవం, గొప్పదనం కోల్పోతాం. భారత దేశం మళ్ళీ మత కల్లోలాలు జరిగే మధ్యయుగాల నాటికి పయనిస్తుందనడంలో సందేహం లేదు. ఉత్తర భారత దేశంలోని అనేక రాష్ట్రాల్లో బిజెపి అధికారంలో ఉంది. గతంలో అధికారంలో ఉన్న ఏకైక కర్నాటక రాష్ట్రంలో బిజెపి గతఎన్నికల్లో అధికారాన్ని కోల్పోయింది. వింధ్యపర్వతాలకు దక్షిణాది రాష్ట్రాల్లో మళ్ళీ పాగా వేయాలని ఆ పార్టీ ఈ ఎన్నికల్లో విశ్వప్రయత్నాలు చేస్తోంది. ఈ ఎన్నికల్లో తాను దక్షిణాదిలో అధికారంలోకి రాకపోయినా, కనీసం తనను సమర్థించే పార్టీలకు కానీ, తనను వ్యతిరేకంచని పార్టీలకు కానీ అధికారం దక్కాలని వ్యూహాలు పన్నుతోంది. బిజెపికి అసలు బలమే లేని ఆంధ్రప్రదేశ్‌లో ప్రాంతీయ పార్టీలను సామదానభేద దండోపాయాలతో మచ్చిక చేసుకుంది. జగన్మోహన్ రెడ్డిపైన కేసులు పెట్టడం ద్వారా కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో తన ఉనికినే కోల్పోయింది.ఈ పరిస్థితిని బిజెపి తనకు అనుకూలంగా మలుచుకుని, జగన్మోహన్ రెడ్డిని తన పాలనను కాదనలేని స్థితికి తెచ్చుకుంది. జగన్మోహన్ రెడ్డి చేత చంద్రబాబు పైన కేసులు పెట్టించడం ద్వారా ఆయన్ని కూడా ఆత్మరక్షణలోకి నెట్టేసింది. గతంలో మోడీని దుమ్మెత్తి పోసిన చంద్రబాబును కూడా తననుకాదనలేని విధంగా మలుచుకుంది. తన వ్యూహాలను అమలు చేయడానికి జనసేనను బిజెపి పావులా ఉపయోగించుకుంది. ఈ ఎన్నికల సందర్భంగా ఆంధ్రప్రదేశ్‌లో ఉన్న ప్రాంతీయ పార్టీలన్నీ ఢిల్లీ పాదుషా కనుసన్నల్లోకి పూర్తిగా జారిపోయిన దృశ్యం మన కళ్ళ ముందు స్పష్టంగా కనిపిస్తోంది. మతాధిపత్యానికి, కులాధిపత్యానికి, సామాజిక రుగ్మతలకు వ్యతిరేకంగా అనేక సంఘ సంస్కరణలు, సారా వ్యతరేక ఉద్యమం వంటి సామాజిక ఉద్యమాలకు, రాజకీయ ఉద్యమాలకు ఊపిరి పోసిన ఆంధ్రప్రదేశ్ సమాజాన్ని ఈ మూడు ప్రాంతీయ పార్టీలు ఒక మతాధిపత్య పార్టీ గొడుకు కిందకు ఈడ్చుకుపోతున్నాయి. రాష్ట్రంలో అధికారం కోసం ఈ మూడు ప్రాంతీయ పార్టీల మధ్య ఎంత పెనుగులాట ఉన్నా, కేంద్రంలో తమ పాలనపై ఏమాత్రం నోరు విప్పకుండా వారిని బిజెపి సంసిద్ధం చేసుకోగలిగింది. పార్లమెంటులో వారు చేసిన రైతు వ్యతిరేక, ప్రజా వ్యతిరేక, మైనారిటీ వ్యతిరేక నిరంకుశ చట్టాలను ఏ మాత్రం వ్యతిరేకించనీయకుండా మలుచుకోగలిగింది. ప్రజాభిప్రాయాన్ని కూడా కాదని ఈ నిరంకుశ చట్టాల ఆమోదానికి రెండు ప్రధాన ప్రాంతీయ పార్టీలు మౌనంగా ఆమోద ముద్ర తెలిపాయి. జనసేన పార్టీ పెట్టి పదేళ్ళవుతున్నా, చట్టసభల్లో ఒక్క స్థానం కూడా సంపాదించుకోలేకపోయింది. ఆంధ్రప్రదేశ్‌లో బిజెపికి ఇక్కడ ప్రాణ ప్రతిష్ట చేయడానికి ఆ పార్టీ మంత్రాంగం నడిపి, బిజెపి, జనసేన, తెలుగుదేశం పార్టీలతో ఒక కూటమిని ఏర్పాటు చేసింది. ఈ ఎన్నికల్లో ఈ ముగ్గురినీ ఎదుర్కొంటున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కూడా తెలుగుదేశం, జనసేనను విమర్శిస్తుందే తప్ప బిజెపిపైన కానీ, దాని విధానాలపైన కానీ పల్లెత్తు మాట అనడం లేదు. అంటే రాష్ట్రంలోని మూడు ప్రాంతీయ పార్టీలూ బిజెపి ఆధిపత్యానికి తలొగ్గుతున్నాయి. తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్, ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీలాగా బిజెపిని వ్యతిరేకించలేకపోతోంది. మూడు ప్రాంతీయ పార్టీలు కలిసి ఆంధ్రప్రదేశ్‌కున్న పూర్వపు ఆత్మాభిమాన చరిత్రను ఒదిలేసి, ఆత్మన్యూనతలోకి జారిపోయేలా చేస్తున్నాయి. ఆ దిశగా రాష్ట్రాన్ని ఈడ్చుకుపోతున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రాంతీయ పార్టీల నాయకత్వానికి దూర దృష్టి, రాష్ట్ర భవిష్యత్తు, ప్రజల సర్వతోముఖాభివృద్ధి గురించి ఆలోచించే రాజనీతిజ్ఞత కొరవడింది. ఘనమైన చారిత్రక, సాంస్కృతిక వారసత్వం గల రెండు తెలుగు రాష్ట్రాలు అభివృద్ధి చెందాలి. ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా ఉన్న రాయలసీమకు ఇవ్వవలసిన నీటి వాటాను ఇస్తూనే, ఆ ప్రాంతంతో చేసుకున్న ఒప్పందాలను అమలు చేస్తూ, దాని ఉనికిని కాపాడాలి. రాయలసీమ నుంచి ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకులు వచ్చినంత మాత్రాన ఈ ప్రాంతానికి ఒరిగిందేమీ లేదు. రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న నీటి సమస్యలు, విభజన సమస్యలను కేంద్రం చేతికి వెళ్ళినట్టయితే రొట్టె కోసం రెండు పిల్లులు పోట్లాడుకుని, కోతి చేతికి న్యాయాధికారం అప్పగించినట్టే అవుతుంది. ఆంధ్రుల చైతన్యానికి నిజంగా ఇది అవమానకరం. చైతన్యవంతమైన ఆంధ్ర సమాజం రాజకీయంగా దారితప్పుతోంది. చైతన్యవంతమైన ఆంధ్ర సమాజం మత విద్వేషాలకు ఆలంబన కాకూడదు.

## ప్రలోభాలపై కలెక్టర్ దృష్టి ..!



సార్వత్రిక ఎన్నికలకు నామినేషన్లు మొదలైన నేపథ్యంలో ఎన్నికల ర్యాలీలు, ప్రచారాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఎం.హరినారాయణన్ నోడల్ అధికారులను ఆదేశించారు. నగరపాలకసంస్థ కార్యాలయంలోని కమాండ్ కంట్రోల్ సెంటరులో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఫ్లయింగ్ స్క్వాడ్, స్టాటికల్ సర్వేలెన్స్ బృందాలు క్షేత్రస్థాయిలో సమర్థంగా పని చేయాలన్నారు. అభ్యర్థులు నామినేషన్ల దాఖలు సమయాలను తెలుసుకుని ర్యాలీలను వీడియో గ్రఫీ తీయాలని, వ్యయాలను అభ్యర్థుల ఖాతాల్లో జమ చేయాలన్నారు. ఎక్సైజ్, పోలీసు శాఖలు సమన్వయంతో పని చేసి మద్యం నిల్వలు, ఉచితాలను, నగదు బదిలీలు గుర్తించి సీజ్ చేయాలన్నారు. ప్రచారాలపై ప్రత్యేక దృష్టి పెట్టి ఓటర్లను ప్రలోభాలకు గురి చేసే వివిధ వస్తువుల పంపిణీపై దృష్టి పెట్టాలన్నారు. రాత్రి వేళల్లో కూడా తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. సమావేశంలో శిక్షణ కలెక్టర్ సంజనా సింహ, డీఆర్వో లవన్న, నోడల్ అధికారులు బాపిరెడ్డి, పద్మావతి, కన్నమనాయుడు పాల్గొన్నారు.

తేది : 22-04-2024 ఆంధ్రలక్ష్మి 7 సంపుటి : 15 సంచిక : 32

# ఓటరు చైతన్యమే.. ప్రజాస్వామ్యానికి విజయం..!



నేడు మన తెలుగు రాష్ట్రాలతోపాటు దేశంలో జరుగుతున్న పార్లమెంట్‌కు శాసనసభ ఎన్నికల ప్రక్రియలో గల అభ్యర్థుల ఎంపిక, ఎన్నికల నిర్వహణకు వివిధ పార్టీల అభ్యర్థులు పెట్టే ఖర్చు దేశంలోనే ప్రథమ స్థానంలో తెలుగు రాష్ట్రాలు ఉంటాయనడంలో ఎలాంటి సందేహం లేదు. ఉత్తర భారతదేశంలో అభ్యర్థుల ఖర్చుల కన్నా, దక్షిణ భారతదేశంలోని అభ్యర్థుల ఎన్నికల ఖర్చులు పదుల రెట్లు ఎక్కువగా ఉన్నాయని పలువురి విశ్లేషణలు, గణాంకాలు మనకు తెలియ జేస్తున్నాయి. తెలుగు రాష్ట్రాల్లో ఒక పురపాలక సంఘం చైర్మన్ ఎన్నికలకు పెట్టే ఖర్చుతో బీహార్ లాంటి రాష్ట్రంలో ఎంపీగా గెలవచ్చునని ప్రతీతి. హైదరాబాద్ పరిసర మేజర్ గ్రామ పంచాయతీ ఎన్నికల కోసం పెట్టే ఖర్చు, ఉత్తరాదిన ఏ రాష్ట్రంలోనైనా ఎమ్మెల్యేగా గెలవడానికి సరిపోతుందన్నది అనేక సర్వేల వాస్తవం. ప్రజాస్వామ్య విధానంలో ప్రత్యక్ష ఎన్నికలే ప్రధాన ఘట్టం. ఈ ఎన్నికల ప్రక్రియలో ప్రధాన పాత్రధారుడు, ముఖ్య వినియోగదారుడు ఓటరు మహాశయుడు మాత్రమే. ఓటరు చైతన్యంతో, విచక్షణతో వ్యవహరించడం ద్వారానే ప్రజాస్వామ్యం విజయవంతం అవుతుంది. అప్పుడే ప్రజాస్వామ్య వాస్తవ ఫలాలు ప్రజలకు చేరువ అవుతాయి. కానీ గత మూడు దశాబ్దాలుగా ఆంధ్ర ప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల రాజకీయాల్లో అన్ని జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీలు పథకం ప్రకారం ఎన్నికల ఖర్చును పెంచి, సామాన్యుడు ఎన్నికల్లో పాల్గొనకుండా ఉండేందుకు కుట్ర కొనసాగుతుంది. అభ్యర్థుల ఎంపికలో కూడా గుణగణాల కన్న ఆర్థిక స్థోమతలే ప్రామాణికంగా ముందుకు సాగుతున్నాయి. ఎన్నికల సమయంలో కూడా ఓటర్లను మరింతగా ప్రలోభ పెట్టే విధానాల్లో భాగంగా మద్యంతో పాటు ఓటు కొనుగోలు ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. నేడు దానినే ఎన్నికల ఆనవాయితీగా, ఆచారంగా, సంప్రదాయంగా మార్చివేశారు. అందువలన ఒక్క డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన ఎస్సీ, ఎస్టీ, నియోజకవర్గాలలో మాత్రమే రాజకీయ పార్టీలు తప్పని సరై ఆయా వర్గాల అభ్యర్థులను కొనసాగిస్తున్నారన్నది మనం గమనించాలి. మిగిలిన అన్ని నియోజకవర్గాలలో రాజకీయ పార్టీలు మంచోడికి బదులుగా సంచోడి కోసం వెతుకుతున్నాయి. డబ్బుల సంచి లేనందున, ఎంత మంచి అభ్యర్థులైనా ఎన్నికల్లో పోటీ చేసేందుకు తమకు తాముగా విరమించుకుని అనర్హులుగా మిగిలిపోయి అభ్యర్థులకు అనుచరులుగానే మిగిలిపోతున్నారు. అలాగే అభ్యర్థుల చరిత్రలను సైతం పరిశీలిస్తే, అవినీతికి దగ్గరగా, నిజాయితీకి దూరంగా అన్ని పార్టీల అభ్యర్థులు మెజారిటీగా ఉన్నారన్నది వాస్తవం. ఇది నేరుగా వారికి వారే, వారి ప్రసంగాలలో ఒకరిపై ఒకరు చేసుకుంటున్న విమర్శలలో స్పష్టంగా మనకు తెలుస్తున్నది. మరి ఇలాంటి పరిస్థితిలో అభ్యంతరం చెప్పలేక గత్యంతరం లేని ఓటర్లు ఒకవైపు ఉంటే, ఆయా పార్టీలు మావే అన్నట్టు అంకితమైన అమాయకపు కార్యకర్తలు మరోవైపు ఉన్నారు. వీరిని గెలుపే ధ్యేయంగా అనేక ప్రలోభాలతో మభ్యపెడుతూ, ఉసిగొల్పుతున్న పార్టీ నాయకత్వాలు. అంతేకాక వారి గెలుపు కోసం అభ్యర్థులు చేస్తున్న శుష్క వాగ్దానాలతో, ఉచిత పథకాల నినాదాలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్న ప్రజలు. తమ ఓటుకు రేటు పెంచి ఓటర్లను తికమక పెడుతున్న పార్టీల తీరు ఓటర్లను అయోమయానికి గురి చేస్తున్న పరిస్థితి మనం చూస్తున్నాం. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కుకు ఉన్న విలువ(గౌరవం) పెరగవలసిన దశలో దాని విలువ(ధర)ను పెంచుతున్న పార్టీల తీరులో అభ్యర్థులు, ఓటర్లు ఎవరికివారు సమర్థించుకుంటున్నారు. అభ్యర్థి మాటల్లో ఓటరు ఓటుకు డబ్బులు అడుగుతున్నాడు మేము ఇస్తున్నాము అని అభ్యర్థులు అంటుంటే... ఓటరు మాత్రం ఐదేళ్ల వరకూ మళ్లీ కనిపించని అభ్యర్థి దగ్గర ఇదన్నా పొందుదాం అని, అభ్యర్థి ఇస్తున్నాడు కాబట్టే మేము తీసుకుంటున్నాము అని ఓటరు అంటున్నాడు. వెరసి కొనుక్కొన్న ఓట్లతో గెలిచిన అభ్యర్థి ఈ ఎమ్మెల్యే,ఎంపీ పదవి తన ఇష్టారాజ్య పాలనకు,ఆర్థిక దోపిడీకి ప్రజలు ఐదేళ్లకు తనకు ఇచ్చిన అనుమతి గా భావిస్తున్నారు. వందకు, వెయ్యికి,మందుకు,మాంసానికి తలొగ్గిన ఓటర్లు ఐదేళ్ల కాలంలో గెలిచిన అభ్యర్థిని వారి,వారి అవసరాల కోసం ప్రశ్నించడానికి గల అర్హతను కోల్పోతున్నారు. నేటి సార్వత్రిక ఎన్నికల బరిలో ఉన్న పార్టీలు,ఆయా అభ్యర్థుల అర్హతలు, అనర్హతలను బట్టి ఓటు వేసేందుకు నిర్ణయించుకునే ప్రక్రియలో ఓటరు పరిస్థితి ఎలా ఉన్నదంటే, ఎన్నికల గంపలో ఉన్న కాయలన్నీ రకరకాలుగా చెడిపోయి ఉన్న స్థితిగా ఉన్న పరిస్థితుల్లో ఏదో ఒకటి ఏరుకునేందుకు వెదుకులాటలో ఉన్న ఓటరు, తక్కువ చెడిపోయిన కాయను వెతుక్కునే పనిలో ఉన్నారన్నది వాస్తవం అంటే ఎన్నికల బరిలో ఉన్న అన్ని పార్టీల అభ్యర్థులు ఒకరికి ఒకరు తీసిపోని అవినీతి, అక్రమాలతో ఉన్న వారైనపుడు ఓటరు దానిలో కూడా తక్కువ ప్రమాదం, తక్కువ అవినీతి ఉన్న అభ్యర్థి వైపు చూస్తారన్నది మనం గమనించాలి. మరింతగా ఆలోచిస్తే ఎన్నికల్లో అభ్యర్థులందరూ డబ్బులు పంచుతున్నారు కాబట్టి, మా కుటుంబంలో ఓట్లను కూడా అన్నిపార్టీలకు పంచుతామంటున్న కొంతమంది ఓటర్ల తీరు కూడా గెలుపు, ఓటములను తారుమారు చేస్తాయన్నది కూడా మనం గమనించాలి. ఎన్నికల ప్రక్రియలో ఓటు చేర్పులు నుండి, ఓటు తొలగింపు, ఓటు వినియోగం వరకు గల అనేక అక్రమాలు, ఎన్నికలలో అవినీతి, నేరస్థుల ప్రవేశం, ఓటర్ల కొనుగోలు, వివిధ వాగ్దానాలతో అభ్యర్థి ఓటర్లను ప్రలోభ పెట్టే తీరు, దొంగ ఓట్లు పోలింగ్, తదితర ఎన్నికల అక్రమాలను కట్టడి చేయడంలో గత దశాబ్దాలుగా ఎన్ని చట్టాలు తెచ్చినా అక్రమాలను నిలువరించడంలో ఎన్నికల సంఘం విఫలమవుతూనే ఉన్నదనడం ముమ్మాటికీ వాస్తవం. ఓటు కోసం ఓటరుకు అభ్యర్థి డబ్బు పంచడాన్ని నేరం అంటూ తప్పుపడుతున్న ఎన్నికల సంఘం, అదే సమయంలో పాలక, ప్రతిపక్ష పార్టీలు, నేతలు మేము గెలిస్తే, మమ్మల్ని గెలిపిస్తే ప్రతివారికి పెన్షన్ ఐదు వేలు ఇస్తాం, జీతాలు పెంచుతాం, ఉద్యోగాలు ఇస్తాం, బాకీలు రద్దు చేస్తాం, వడ్డీ లేని రుణాలు ఇస్తాం అంటూ అనేక హామీలు ఇవ్వడాన్ని ఓటర్లను ప్రలోభ పెట్టే ప్రక్రియగా ఎందుకు భావించడం లేదో సమాధానం లేని వెయ్యి డాలర్ల ప్రశ్నగా మిగిలిపోతుంది. వ్యవసాయంలో రైతు సరైన విత్తనం ఎంపికలోనే మంచి పంటతోపాటు తన భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అలాగే మంచి కోర్సు ఎంపికలోనే విద్యార్థి బంగారు భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. అలాగే ఎన్నికలలో మంచి అభ్యర్థిని ఎంపిక చేసుకోవడం ద్వారా మాత్రమే ఆయా నియోజకవర్గ ప్రజల అభివృద్ధి, అభ్యున్నతికి దోహద పడుతుందని ప్రజలు, ఓటర్లు గ్రహించాలి. అదే నిజమైన ఓటరు చైతన్యం.మే నెలలో జరిగే సార్వత్రిక ఎన్నికలలో తెలుగు రాష్ట్రాలలో అన్నిఅసెంబ్లీ, పార్లమెంట్ నియోజకవర్గాలలోని ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోవడంలో అభ్యర్థుల నుండి వచ్చే తాత్కాలిక ప్రయోజనాలతో కూడిన పథకాల పేరుతో పెట్టే ప్రలోభాలకు తల ఒగ్గకుండా నిర్భయంగా, నిజాయితీగా మంచి అభ్యర్థికి ఓటు వేసి, గెలిపించు కోవాలి.

# ఇసికి ఎపి ప్రభుత్వంపై ఫిర్యాదు..!




టిడిపి, జనసేన, బిజెపి కూటమి నేతలు కనకమేడల రవీంద్రకుమార్, నాదెండ్ల మనోహర్, అరుణ్ సింగ్, జీవీఎల్ నరసింహారావు నేడు కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసి ఎపి ప్రభుత్వంపై ఫిర్యాదు చేశారు. ఎపి ప్రభుత్వం అధికార యంత్రాంగాన్ని దుర్వినియో గం చేస్తోందని వెల్లడించారు. కొందరు అధికారులు వైసిపికి అనుకూలంగా పనిచేస్తున్నారని, విపక్ష నేతలను వైసిపి ప్రభుత్వం వేధిస్తోందని ఇసికి వివరించారు. రాష్ట్రంలో స్వేచ్ఛాయుత వాతావరణంలో ఎన్నికలు జరిగేలా చూడాలని కోరారు. ఎపిలోని సమస్యాత్మక పోలింగ్ బూత్‌లలో వీడి యో రికార్డింగ్ కు ఏర్పాట్లు చేయాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ఎన్నికల సంఘాన్ని కలిసిన అనంతరం బిజెపి నేత అరుణ్ సింగ్ మాట్లాడుతూ, ఎపి డిజిపి, సిఎస్, ఇంటెలిజెన్స్ డిజిపి వైసీపీ ఒత్తిళ్లకు లోబడి పనిచేస్తున్నారని, వారు స్వతంత్రంగా పనిచేయలేకపోతున్నార న్న విషయాన్ని ఇసి దృష్టికి తీసుకెళ్లామని వెల్లడించారు. ఇప్పటికే చంద్రబాబు అనేక ఫిర్యాదులు చేశారని అరుణ్ సింగ్ పేర్కొన్నారు. ఎన్నికల సంఘం తక్షణమే చర్యలు చేపట్టాలని విన్నవించుకున్నారు. జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ, మూడు పార్టీల నేతలం మంగళవారం ఎన్నికల సంఘాన్ని కలిసి కొన్ని నివేదికలు అందించామని వెల్లడించారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిస్థాయిలో క్షీణిం చాయని, సాక్షాత్తు ముఖ్యమంత్రికే రక్షణ లేదన్న విషయాన్ని ఇసికి వివరించామని పేర్కొన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ పైనా చాలా ప్రాంతాల్లో కావాలనే రాళ్ల దాడులు చేయిస్తున్నారన్న విషయాన్ని ఇసికి తెలియజేశామన్నారు. డిజిపి, ఇంటెలిజెన్స్ డిజిపి, సిఎస్‌ల పర్యవేక్షణ లోనే ఇన్ని సంఘటనలు జరుగుతుంటే, కేంద్ర ఎన్నికల సంఘం జోక్యం చేసుకోవాల్సిన అవసరం ఉందని తాము భావిస్తున్నట్టు నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. ఓటరు లిస్టు అక్రమాలపై జాగ్రత్తగా పరిశీలన చేపట్టాలని ఇసిని కోరామని చెప్పారు. అధికారం కోల్పోతామన్న భయంతో జిల్లాల్లో కిందిస్థాయి అధికారులను కూడా బెదిరించే స్థాయికి వచ్చారని నాదెండ్ల మనోహర్ విమర్శించారు. తమ వద్ద ఉన్న ఆధారా లతో చంద్రబాబు ఇప్పటికే పలు లేఖలు రాశారని వివరించారు. ప్రశాంత వాతావరణంలో, ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరగాలన్నదే తమ అభిమతం అని నాదెండ్ల స్పష్టం చేశారు. టిడిపి నేత కనకమేడల రవీంద్ర కుమార్ మాట్లాడుతూ, మంగళవారం ఎన్డీయే నేత అరుణ్ సింగ్ నేతృత్వంలో తాము ఎన్నికల సంఘాన్ని కలిశామని, చీఫ్ ఎలక్షన్ కమిషనర్, ఇద్దరు ఎన్నికల కమిషనర్లను కూడా కలిసి ఎపిలో పరిస్థితులను వివరించామని వెల్లడించారు. ఎపి సిఎస్, డిజిపి, ఇంటెలిజెన్స్ డిజిపి రాష్ట్ర ప్రభుత్వానికి వత్తాసు పలుకుతూ, ప్రజాస్వామ్య విలువలకు భంగం కలిగిస్తున్నారని ఇసికి నివేదించామని వెల్లడించారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చాక కూడా సిఎస్ తనకు అనుకూలమైన అధికారులకు పోస్టింగులు ఇచ్చిన వైనాన్ని, సిఇఒను కూడా తన వద్దకు పిలిపించుకుని సమీక్షలు చేస్తూ, ఎన్నికల సంఘానికి స్వతంత్ర ప్రతిపత్తి లేకుండా ఆయన వ్యవహ రిస్తున్న తీరును ఇసికి వివరించామని కనకమేడల తెలిపారు. డిజిపి పోలీసు బలగాన్నంతా తన నియంత్రణలో ఉంచుకుని, ప్రధాని హాజరైన సభకు కూడా సరైన బందోబస్తు కల్పించకుండా, ప్రోటోకాల్ చర్యలు తీసుకోకుండా బాధ్యతారహితంగా వ్యవహరించారన్న విషయాన్ని ఇసికి తెలియజేశామని పేర్కొన్నారు.

తేది : 22-04-2024 ఆంధ్రలక్ష్మి 8 సంపుటి : 15 సంచిక : 32

# సింహపురిలో.... గర్జించేది ఎవరు....?






రాష్ట్రంలోని ఏ జిల్లాలోను జరగని రాజకీయ చర్చ నెల్లూరులో జరిగింది. వైఎస్ఆర్‌సీపీ తరఫున గెలిచి ఆ పార్టీపైనే తిరుగుబాటు చేసి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఏక చత్రాధిపత్యాన్ని ప్రశ్నిస్తూ పార్టీలు మారిన వారిని ఇక్కడ చూశాం. రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన జరిగిన తర్వాత ప్రకాశం జిల్లా నుంచి కందుకూరు నియోజక వర్గం నెల్లూరు జిల్లాలో కలిసింది. మొత్తం 8 అసెంబ్లీ నియోజక వర్గాల్లో ఎమ్మెల్యేలు అందరూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన వారే. వారిలో నెల్లూరు రూరల్, వెంకటగిరి, ఉదయగిరి నియోజక వర్గాల ఎమ్మెల్యేలు కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, ఆనం రామనారాయణరెడ్డి, మేకపాటి చంద్రశేఖర్‌రెడ్డి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నియంతృత్వ పోకడను ప్రశ్నించారు. అయితే వెంకటగిరి తిరుపతి జిల్లాలో కలవగా కందుకూరు నెల్లూరు జిల్లాలో వచ్చి చేరింది. కందుకూరు ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డి కూడా ఒక విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ఒక విధంగా తిరుగుబాటు బావుటా ఎగుర వేసిన వారే. తన నియోజక నియోజక వర్గంలో సమస్యలను పరిష్కరించడంలో సీఎం జగన్ విఫలమయ్యారని ఒకటికి నాలుగు సార్లు ధర్నాలు కూడా చేశారు మహీధర్‌రెడ్డి. నెలూర్లు సిటీ నుంచి పోలుబోయిన అనిల్‌కుమార్ యాదవ్ సిట్టింగ్ ఎమ్మెల్యే. మంత్రిగా పని చేశారు. జగన్‌మోహన్‌రెడ్డికి వీర విధేయుడు. అయినా ఆయనకు సిటీ టికెట్ దక్క లేదు. ఇక్కడ నుంచి తీసుకెళ్లి ఏకంగా నరసరావుపేట పార్లమెంట్ స్థానంలో పోటీకి దించారు. మంత్రిగా పని చేసిన అనిల్ ఎందుకు నెల్లూరు సిటీలో పనికి రాకుండా పోయారో ఇప్పటికీ వైఎస్ఆర్‌సీపీలో ఉన్న నాయకులకు కానీ ఆ నియోజక వర్గంలోని నాయకులకు కానీ అంతు చిక్కడం లేదు. నియోజక వర్గంలో 1,16,230 మంది పురుష ఓటర్లున్నారు. ఇక 1,22, 168 మంది మహిళా ఓటర్లున్నారు. అంటే సుమారు 6వేలకుపైగా మహిళా ఓటర్లే ఎక్కువ. థర్డ్ జండర్ ఓటర్లు 67 మంది ఉన్నారు. సిటీ నియోజక వర్గంలో వైఎస్ఆర్‌సీపీకి పూర్తి స్థాయిలో పట్టుందని చెబుతున్నా అభ్యర్థిని మార్చుకోక తప్ప లేదు. నగర డిప్యూటీ మేయర్ ఎండి ఖలీల్ అహ్మద్‌ను వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా రంగంలోకి దింపింది. ఎన్డీఏ కూటమి అభ్యర్థిగా టీడీపీ నాయకుడు, మాజీ మంత్రి పి నారాయణ రంగంలోకి దిగారు. ఇక కాంగ్రెస్, కమ్యునిస్టుల కూటమి నుంచి సీపీఎం అభ్యర్థిగా మూలం రమేష్‌ను ప్రకటించారు. ఒకరు ముస్లిం మైనారిటీ కాగా మరొకరు బలిజ సామాజిక వర్గానికి చెందిన వారు. ఇంకొకరు గౌడ్ సామాజిక వర్గానికి చెందిన వారు. భిన్న కులాలకు చెందిన వ్యక్తులు ఈ నియోజక వర్గం నుంచి పోటీ చేస్తున్నారు. ఇక ఓటర్లదే తుది నిర్ణయం. ఇక్కడ నుంచి కోటం రెడ్డి శ్రీధర్‌రెడ్డి గెలుపొందారు. తనకు మంత్రి పదవి ఇవ్వలేదని, కనీసం మాట్లాడేందుకు కూడా అవకాశం ఇవ్వలేదని సీఎం వైఎస్ జగన్‌తో విభేదించిన శ్రీధర్‌రెడ్డి టీడీపీలో చేరారు. తెలుగు దేశం పార్టీ శ్రీధర్‌రెడ్డిని రూరల్ అభ్యర్థిగా ప్రకటించింది. వైఎస్ఆర్‌సీపీ నుంచి సిట్టింగ్ ఎంపీ ఆదాల ప్రభాకరరెడ్డి రంగంలోకి దిగారు. కాంగ్రెస్ అభ్యర్థిగా షేక్ ఫయాజ్ పోటీ చేస్తున్నారు.

నెల్లూరు రూరల్‌లో శ్రీధర్‌రెడ్డి పార్టీ మారాడే కానీ మూడు నెలల క్రితం వరకు ఇద్దరూ ఒక పార్టీ వారే. శ్రీధర్‌రెడ్డి, ప్రభాకరరెడ్డిలో ఎవరిని ఓటర్లు ఆదరిస్తారు. ఈ సారి కాంగ్రెస్‌కు కనీస డిపాజిట్లు వస్తాయనేది రాజకీయ పార్టీలో జరుగుతున్న చర్చ. నెల్లూరు రూరల్‌లో పురుష ఓటర్లు 1,35,677 మంది ఉన్నారు. మహిళా ఓటర్లు 1,43, 192 మంది ఉన్నారు. ఇక్కడ కూడా మహిళా ఓటర్లే ఎక్కువ. ఇక థర్డ్ జండర్ ఓటర్లు 20 మంది ఉన్నారు. కోవూరులో సిట్టింగ్ ఎమ్మెల్యే నల్లపురెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి. వైఎస్ఆర్‌సీపీ నుంచి రెండో సారి గెలుపొందారు. తిరిగి ఆయనకే టికెట్ కేటాయించారు. ఇక్కడ నుంచి టీడీపీ నుంచి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పోటీ పడుతున్నారు. ఈమె నెల్లూరు పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి భార్య. ఇటీవలె తెలుగు దేశం పార్టీలో చేరారు. వైఎస్ఆర్‌సీపీ రాజ్యసభ సభ్యుడిగా ఉండి జగన్‌మోహన్‌రెడ్డి నియంతృత్వ పోకడలు భరించలేక పోతున్నామంటూ టీడీపీలో చేరారు. ఇక్కడ ఎవరిని ఓటర్లు ఆదరిస్తారనేది పెద్దచర్చగా మారింది. నల్లపరెడ్డి శ్రీనివాసుల రెడ్డి హయాం నుంచి కూడా వారి కుటుంబం వారే ఇక్కడ రాజకీయాలు చేస్తున్నారు. ప్రభాకరరెడ్డి కుటుంబం కొత్తగా ఈ నియోజక వర్గంలోకి అడుగుపెట్టింది. ప్రజలు ఎవరిని ఆదరిస్తారో ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే. ఈ నియోజక వర్గంలోను మహిళా ఓటర్లే అధికం. 1,37,911 మంది మహిళా ఓటర్లు ఉండగా, 1,28,614 మంది పురుష ఓటర్లు ఉన్నారు. థర్డ్ జండర్ ఓటర్లు 25 మంది ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న కాకాని గోవర్ధన్‌రెడ్డి వ్యవసాయ శాఖ మంత్రి. వైఎస్ఆర్‌సీపీ నుంచి రెండో సారి గెలిచి మంత్రి పదవిని సాధించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థి కూడా ఆయనే. తెలుగు దేశం పార్టీ తరఫున మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి తిరిగి పోటీ చేస్తున్నారు. కాకాని గోవర్ధన్‌రెడ్డిపై ఇటీవల పలు ఆరోపణలు సోమిరెడ్డి లేవనెత్తారు. ఆయనను అరెస్టు చేయాలని కోరుతూ నిరాహార దీక్షలు కూడా చేశారు. ఇసుక, గ్రావెల్, వైట్ క్వార్ట్జ్ వంటి మైనింగ్‌ల దోపిడీకి పాల్పడ్డారని సోమిరెడ్డి ఆరోపించారు. ఇలాంటి పరిస్థితుల్లో మూడో సారి గోవర్ధన్‌రెడ్డి విజయం సాధిస్తారా లేదా చంద్రమోహన్‌రెడ్డిని ఓటర్లు ఆదరిస్తారనేది ఎన్నికల వరకు వేచి చూడాల్సిందే. ఈ నియోజక వర్గంలోను మహిళలే ఎక్కువ మంది ఓటర్లు ఉన్నారు. 1,18, 896 మంది మహిళా ఓటర్లు కాగా, 1,12,536 మంది పురుష ఓటర్లున్నారు. ఇక థర్డ్ జండర్ల ఓట్లు 26 ఉన్నాయి. ఆత్మకూరు నియోజక వర్గం నుంచి వెంకటగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు. ఈయన జగన్‌ను విభేదించి టీడీపీలో చేరారు. ఆత్మకూరు సిట్టింగ్ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తిరిగి వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగారు. ఇద్దరూ రాజకీయ కుటుంబాల నుంచి వచ్చిన వారే. ఆనం సీనియర్ కాగా మేకపాటి జూనియర్. సీనియరిటీ విజయం సాధిస్తుందా, దివంగత మంత్రి గౌతమ్‌రెడ్డి సోదరుడైన విక్రమ్‌రెడ్డి గౌతంరెడ్డి సానుభూతిని తిరిగి సంపాదిస్తారా అనేది చర్చగా మారింది. ఆనంకి కూడా ఈ ఎన్నికలు సవాలు లాంటివే. ఎందుకంటే వారి కుటుంబానికి కూడా ఈ నియోజక వర్గంలో మొదటి నుంచి పట్టుంది. తిరిగి ఆ పట్టును నిలుపుకుంటారా లేదా అనేది స్థానికుల్లో చర్చగా మారింది. ఈ నియోజక వర్గంలో మహిళా ఓటర్లు ఎక్కువుగా ఉన్నారు. 1,9,164 మంది మహిళా ఓటర్లు, 1,05,482 మంది పురుష ఓటర్లు, థర్డ్ జండర్ ఓటర్లు 8 మంది ఉన్నారు. కావలిలో సిట్టింగ్ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి రెండు సార్లు వైఎస్ఆర్‌సీపీ నుంచి గెలుపొందారు. తిరిగి మూడో సారి వైఎస్ఆర్‌సీపీ నుంచి పోటీ పడుతున్నారు. టీడీపీ అభ్యర్థిగా కావ్యకృష్ణారెడ్డి రంగంలోకి దింపారు. ఈయన మొదటి సారిగా టీడీపీ అభ్యర్థిగా రంగంలోకి దిగుతున్నారు. 2014లో టీడీపీ నుంచి బీదా మస్తాన్‌రావు, 2019లో కాటంరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి టీడీపి నుంచి పోటీ చేసి ఓడిపోయారు. 2024 ఎన్నికల్లో చంద్రబాబు కొత్త అభ్యర్థిని రంగంలోకి దింపడం విశేషం. ఇక్కడ స్త్రీల ఓట్లు 1,21,036 ఉన్నాయి. పురుషుల ఓట్లు 1,16,745 ఉన్నాయి. థర్డ్ జండర్ ఓట్లు 28 ఉన్నాయి. గత ఎన్నికల్లో మేకపాటి చంద్రశేఖరరెడ్డి వైఎస్ఆర్‌సీపీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచారు. 2014లో ఓటిపోయినప్పటికీ 2019లో గెలిచి నియోజక వర్గంలో తన పట్టును నిలబెట్టుకున్నారు. 2014 మినహా 2004, 2009, తర్వాత జరిగిన 2012 ఉప ఎన్నికల్లోను చంద్రశేఖరరెడ్డి విజయం సాధించారు. అయితే సీఎం జగన్‌తో వచ్చిన విబేధాల నేపథ్యంలో ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. తెలుగుదేశం పార్టీ నుంచి టికెట్ సాధించి పోటీ చేస్తారని అందరూ భావించారు. అయితే చంద్రశేఖరరెడ్డి కాకుండా కాకర్ల సురేష్ అనే ఎన్ఆర్ఐకి టీడీపీ టికెట్ కేటాయించింది. వైఎస్ఆర్‌సీపీ మాత్రం మేకపాటి చంద్రశేఖరరెడ్డి సోదరుడు మేకపాటి రాజగోపాల్‌రెడ్డికి టికెట్ కేటాయించడం విశేషం. ఇక్కడ మేకపాటి కుటుంబానికి మంచి పట్టు ఉంది. ఇదే సందర్భంలో టీడీపీకి కూడా మంచి ఆదరణ ఉంది. మాజీ ఎమ్మెల్యే బొల్లినేని రామారావు బలమైన నేత. మేకపాటి చంద్రశేఖరరెడ్డి, బొల్లినేని రామారావులు కలిసి టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్‌కు సహకరించాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య తీవ్ర పోటీ ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ నియోజక వర్గంలో మహిళా ఓటర్లు 1,21,190, పురుషుల ఓటర్లు 1,19,458, థర్డ్ జండర్ ఓటర్లు 10 మంది ఉన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే మానుగుంట మహీధర్‌రెడ్డికి ఈ సారి వైఎస్ఆర్‌సీపీ టికెట్ ఇవ్వలేదు. మహీధర్‌రెడ్డి కందుకూరు నుంచి 4 సార్లు ఎమ్మెల్యేగా గెలిచారు. కనిగిరి సిట్టింగ్ ఎమ్మెల్యే బుర్రా మధుసూదన్ యాదవ్‌ను కందుకూరు వైఎస్ఆర్‌సీపీ అభ్యర్థిగా రంగంలోకి దింపారు. మొదటి సారి బీసీ వ్యక్తి కందుకూరు నుంచి పోటీ చేస్తున్నారు. ఇక్కడ తెలుగుదేశం, కాంగ్రెస్, వైఎస్ఆర్‌సీపీ నుంచి పోటీ చేసిన వారిలో కమ్మ,రెడ్డి సామాజిక వర్గాలకు చెందిన వారు ఉన్నారు. తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా ఇంటూరి నాగేశ్వరరావు రంగంలోకి దిగారు. ఈయన మాజీ ఎమ్మెల్యే దివి శివరామ్ అనుచరుడు. ఇక్కడ ఈ సారి పోటీ నువ్వా నేనా అన్నట్లు సాగుతుందని అంచనా వేస్తున్నారు. వీరకంటూ ప్రత్యేక బలం ఏమీ లేదు. పార్టీ బలాలే వీరి బలాలుగా అంచనా వేస్తున్నారు. పోటీ కూడా హోరా హోరీగా ఉంటుందని భావిస్తున్నారు. ఈ నియోజక వర్గంలో 1,15,387 మంది మహిళా ఓటర్లు, 1,12,921 మంది పురుష ఓటర్లు, 26 థర్డ్ జండర్ ఓటర్లు ఉన్నారు.

Edited, Printed, Published and Owned by Shaik Ghouse Basha, Printed at Mohammed Press, D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001, Andhra Pradesh, Publihsed at D.No. 7/429, Railway Street, Ranganayakulapet, Nellore - 524 001. Andhra Pradesh,
Editor : Shaik Ghouse Basha Cell : 9640300529